విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

ఆదివారం 17 నవంబర్ 2024 8 పేజీలు

అంజమ్మకు నేతల నివాళి

అంజమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు

విశాలాంధ్ర-ఒంగోలు : సీపీఐ జిల్లా కార్యవర్గం సభ్యులు కె వీరారెడ్డి సతీమణి అంజమ్మకు సీపీఐ జిల్లా నాయకులు ఘన నివాళులర్పించారు. సంతాప కార్యక్రమాన్ని శనివారం కందుకూరులోని వీరారెడ్డి స్వగృహంలో నిర్వహించారు. కామ్రేడ్ అంజమ్మ అక్టోబర్ 29న అకాల మరణం పొందారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అంజమ్మ మృతికి నివాళులర్పించి వీరారెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టుల కుటుంబాలలో మగవారితో సమానంగా ఆడవారు పనిచేస్తారన్నారు. మగవారు ఉద్యమాలలో నిమగ్నమైతే వారికి ఎటువంటి వత్తుడులు రాకుండా ఆడవారు అన్ని విధాల సహకరిస్తారన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో మహిళలది కీలక పాత్ర అన్నారు. అంజమ్మకు నివాళులు అర్పించిన వారిలో సీపీఐ - మిగతా 2 లో

- ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు
- ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం
- రోగులకు దుప్పట్లు, టవల్స్, పండ్లు పంపిణీ

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల కీలక పాత్ర

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : సమాజ అభివృద్ధిలో ప్రజలకు-ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పేర్కొన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని శనివారం జిల్లా కుష్టు నివారణ కేంద్రం, వైద్యశాలలో రోగులకు దుప్పట్లు, టవల్స్, పండ్లు పంపిణీ చేవారు. కార్యక్రమముఖ్య అతిథి రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీయూడబ్ల్యూజే సుదీర్ఘ పోరాటల చేస్తుందని, ఐజేయూ గుర్తింపు కలిగి ఉండి నిత్యం అనేక పోరాటాలు చేసి జర్నలిస్ట సమస్యలకు పరిష్కారం చూపుతుందన్నారు. నిత్యం జర్నలిస్టు జీవన పోరాటంలో - మిగతా 2 లో

విస్తృతంగా మొక్కలు నాటాలి

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : సముద్ర తీరం వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం కొరకు విస్తృతంగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. బాపట్ల, చీరాల మండలాలలో జిల్లా కలెక్టర్ శనివారం విస్తృతంగా పర్యటించారు. కార్తీక మాసం సందర్భంగా బాపట్ల సూర్యలంక బీచ్‌ని సందర్శించారు. కార్తీక మాసంలో పర్యాటకులు విస్తృతంగా బీచ్‌కి వస్తున్నందున వసతులను పరిశీలించారు. పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నందున బీచ్‌వద్ద గజ ఈతగాలను ఉంచామన్నారు. దుస్తులు మార్చుకోవడానికి ఏర్పాట్లపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీచ్ వద్ద అనువైన మొక్కలు నాటాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటి, పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని పెంచేలా తీర్చిదిద్దాలన్నారు. బీచ్ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని - మిగతా 2 లో

శ్రీ హర్షిణి కళాశాలలో సినీ తారల సందడి

2

పార్టీని బలోపేతం చేస్తా...

వైపీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజక వర్గ సమన్వయ కర్త చుండూరి రవిబాబు

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో వైసీపీ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని వైసీపీ ఒంగోలు అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయ కర్త చుండూరి రవిబాబు అన్నారు. తనపై నమ్మకం ఉంచి ఒంగోలు అసంబ్లీ నియోజక వర్గ సమన్వయకర్తగా నియమించిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని రవి బాబు అన్నారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవిబాబు మాట్లాడుతూ విద్యార్థి దశనుండి రాజకీయ్యల్లో ఉన్నానని, ప్రజాసమస్య లపట్ల పూర్తి అవగాహన కలిగిన్న తన కుటుంబాన్ని గుర్తుంచి జడ్పీటీసీ మెంబర్‌గా నియమించి, అన్ని విధాలుగా తనను

ప్రోత్సహించిన మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధినాయకుడు జగన్మోహనరెడ్డికి ఆయన కృతజ్ఞత తెలిపారు. పరిపాలన దక్షత కలిగిన జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని, - మిగతా 2 లో

ఆర్డీఎస్ఎస్ పనులపై పురోగతిపై సమీక్ష

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శాఖను కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. ఒక వైపు ప్రస్తుతం నడుస్తున్న అసెంబ్లీలో ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు బిల్లు ప్రవేశపెడుతూ బిజీబిజీగా ఉన్నా మరో వైపు క్షేత్ర స్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపిస్తున్నారు. రియల్ టైంలో సమస్యల పరిష్కారానికి నేరుగా మంత్రి గొట్టిపాటి చొరవ తీసుకుని కీలక సమస్యలను ఎప్పటికప్పుడు తీరుస్తున్నారు. ఈ క్రమంలోనే కీలక సమస్యల పరిష్కార బాధ్యతలను ఓఎస్డీలుకు అప్పగించారు. దీంతో ఓఎస్డీలు - మిగతా 2 లో

జర్నలిస్టుల కీలక పాత్ర (మొదటిపేజీ తరువాయి)

పత్రికా యాజమాన్యాలు వేజ్ బోర్డు ఆదేశాలను అమలు చేయక పోవటంతో కనీసం జీత భత్యాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరించారు. గత ప్రభుత్వంలో వివక్షతో కనీసం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాలను గుర్తు చేశారు. ప్రస్తుతం జనవరి నాటికి నూతన అక్రిడిటేషన్ కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేసే విధంగా ప్రభుత్వం, సమాచార శాఖా మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం నివాస స్థలాల మంజూరుకు, అలాగే ప్రతి జర్నలిస్టుకు నివాసం ఉండేలా కృషి చేస్తామన్నారు. అనంతరం రోగులకు దుప్పట్లు, టవల్స్, పండ్లు పంపిణీ చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు అలుగును సురేష్, జిల్లా కార్యదర్శి డి. కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి వెంకటరావు, శంకర్, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మురళి, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, కోటి రెడ్డి, జయరాం, ఆంధ్ర ప్రభ బ్యూరో భాస్కరరెడ్డి మేనేజర్ అశోక్, బేతాల శ్రీనివాసరావు, సర్వేశ్వరరావు, వైద్యురాలు డాక్టర్ కాండ్రగడ్డ రజిత మానస, ఎల్.టి క్రిష్ణ లీల సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేతల నివాళి (మొదటిపేజీ తరువాయి)

జిల్లా కార్యవర్గం సభ్యులు కె వెంకట్రావు, సయ్యద్ యాసిన్, వి హనుమారెడ్డి, ఎం విజయ, ఎస్ రావమ్మ, మండల కార్యదర్శులు గద్దల బాలకోటయ్య, రామారావు, లక్ష్మీ, ఎస్టీయూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదినారాయణ, సీపీఐ నెల్లూరు జిల్లా సహాయ కార్యదర్శి మాలకొండయ్య, సురేష్, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బలోపేతం చేస్తా... (మొదటిపేజీ తరువాయి)

ముస్ముందు పార్టీ ఏ పిలుపునిచ్చినా అందరినీ కలుపుకుని కలిసి పని చేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లోపార్టీ బలోపేతం చేయ్యడమేకాకుండా సమర్ధవంతంగా పనిచేసి ఉద్యమాలు చేస్తామన్నారు. తనను ఒంగోలు నియోజకవర్గ ఇంచార్జి నియమించడం లో సహకరించిన ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రీజియన్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలకు అయన కృతజ్ఞతలు తెలిపారు. కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అటువంటి వాటికీ బెదిరేదిలేదని అన్నారు. ముస్ముందు ఒంగోలు అసంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవిబాబు నాయకత్వంలో పార్టీని బలోపేతం చేస్తామని, పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదెన్న, నగర పార్టీ అధ్యక్షులు కఠారి శంకర్, కొత్తపట్నం జడ్పీటీసీ శారద, కార్పొరేటర్స్ ఇమ్రాన్,ప్రవీణ్,మహిళా నాయకురాలు బడుగు ఇందిర,వెంకటేశ్వరరావు, భూమిరెడ్డి రమణమ్మ, ఉన్నం జనార్దన్, నాగూర్, ఓబుల్ రెడ్డి, మీరావలి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి (మొదటిపేజీ తరువాయి)

ఆయన సూచించారు. బాపట్ల పరిధిలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం, పాండురంగాపురం బీచ్‌లు పర్యాటకులను ఆకట్టుకునేలా చేయాలన్నారు. డ్వామా, అటవీ శాఖ అధికారులు సంయుక్తంగా పైలెట్ కింద 20 వేల మొక్కలు నాటాలన్నారు. బీచ్ వద్ద కనీసం 10 ఎకరాలలో మొక్కల నాటడానికి చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్‌లో భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. సముద్ర మత్స్య సంపద విక్రయాలను ఆయన పరిశీలించారు. వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. చీరాల వాడరేవును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచేలా చూడాలన్నారు.రెవెన్యూ అసోసియేషన్ అతిథి గృహాన్ని నవీకరించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.సంపద సృష్టించే కార్యక్రమంలో భాగంగా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. వాడరేవులోని పోర్టు పోరంబోకు భూమిలో విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా సుందరీకరణ చేస్తామన్నారు.చీరాల పట్టణంలోని ప్రధాన రహదారిలో శిథిలావస్థలో ఉన్న గ్రామ చావడి భవనాన్ని తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తామని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. సంపద సృష్టిలో భాగంగా భవనం కింద భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులో ప్రభుత్వ కార్యాలయాలు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు.తక్షణమే సంబంధిత ఏర్పాట్లు చేయాలని ఆర్డీవోను ఆయన ఆదేశించారు.ఆయన వెంట డ్వామా పిడి విజయలక్ష్మి,అటవీశాఖ అధికారి భీమయ్య,చీరాల ఆర్డీవో చంద్రశేఖర్,తహసిల్దార్లు గోపికృష్ణ,సలీమా తదితరులు పాల్గొన్నారు.

శ్రీ హర్షిణి కళాశాలలో సినీ తారల సందడి

'దేవకీ నందన వాసుదేవ' మూవీ టీంకు ఆల్‌దబెస్ట్ చెప్పిన శ్రీ హర్షిణి

విశాలాంధ్ర-ఒంగోలు : శ్రీ హర్షిణి కళాశాలలో ' దేవకీ నందన వాసుదేవ' మూవీ టీం సందడి చేసింది. మాజీ ఎంపీ గల్లా జయదేవ్ కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు మేనల్లుడు గల్లా అశోక్, ఎక్స్ మిస్ ఇండియా మానసా వారణాసి హీరో హీరోయిన్‌లుగా నటిస్తున్న దేవకి నందన వాసుదేవా సినిమా ప్రమోషన్‌లో భాగంగా మూవీ టీం ఒంగోలులోని శ్రీ హర్షిణి కళాశాలలో సందడి చేసింది. శ్రీ హర్షిణి కళాశాలల చైర్మన్ గోరంట్ల రవికుమార్ పూర్వ విద్యార్థులలో ఒకరు బాలకృష్ణ సినిమాకు నిర్మాతగా వ్యవహరిస్తుండగా మరో విద్యార్థి ఈశ్వర్ దత్ దేవకి నందన వాసుదేవ సినిమాకు గాయకునిగా చేస్తున్నారు. గోరంట్ల రవికుమార్ పూర్వ విద్యార్థులలో ఒకరు నిర్మాతగా మరొకరు సింగర్‌గా చేస్తూ సినిమా ప్రమోషన్‌కు శ్రీ హర్షిణి కళాశాలకు రావడంతో కళాశాల యాజమాన్యం సినీ హీరో హీరోయిన్‌లతో పాటు నిర్మాత సింగర్ లకు ఘన స్వాగతం పలికింది. వేలాదిమంది విద్యార్థుల నడుమ కళాశాలలో దేవకి నందన వాసుదేవ టీం సందడి చేసింది. మూవీ టీం చేసిన సందడి వాతావరణంతో శ్రీ హర్షిణి విద్యార్థిని విద్యార్థుల కేరింతలతో కళాశాల ప్రాంగణం ఉద్రూతలూగింది. ఈనెల 22న దేవకి నందన వాసుదేవ సినిమా రిలీజ్ కానున్నట్లు వారు తెలియజేయగా శ్రీ హర్షిణి విద్య సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు మూవీ టీంకు ఆల్ ద బెస్ట్ తెలిపారు. మూవీ ప్రమోషన్ కు వచ్చిన తమకు ఘన స్వాగతం పలికారంటూ మూవీ టీం శ్రీ హర్షిణి కు ధన్యవాదాలు తెలిపింది.

బైక్ దొంగలు అరెస్టు : ఎస్పీ

విశాలాంధ్ర-ఒంగోలు : వరుస బైక్ దొంగతనాలు గంజాయి అమ్మకమునకు పాల్పడుతున్న వ్యక్తులను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి రూ.26లక్షల విలువైన 33 మోటార్ సైకిళ్లు మరియు 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ దామోదర్ కేసుల తాలుకు వివరాలను మీడియాకు శనివారం తెలిపారు. అరెస్టు అయిన వారిలో కందుకూరు టౌన్ వద్దెరపాలెంకు చెందిన కుంచాల శివప్రసాద్, కందుకూరు మండలం దూబగుంటకు చెందిన ఉప్పు శ్రీకాంత్, ఒంగోలు కొణిజేడు బస్టాండ్ వద్ద నివాసముంటున్న సహాద్దీన్ సర్దార్‌లను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 4కెజీల గంజాయి(దీని విలువ సుమారు రూ.20వేలు) ప్రకాశం జిల్లాకు చెందిన 15బైక్‌లు, బాపట్ల జిల్లాకు చెందిన ఒక బైక్, పల్నాడు జిల్లాకు చెందిన ఒక బైక్, నెల్లూరు జిల్లాకు చెందిన 16బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. మొత్తం బైక్‌ల విలువ రూ.25.80లక్షలు ఉంటుందన్నారు. మొత్తం చోరీ సొత్తు రూ.26లక్షలు ఉంటుందన్నారు. ఒంగోలు శర్మాకాలేజీ వద్ద ముగ్గురు వ్యక్తుల కదలికలు అనుమానంగా ఉండటం,పోలీసులను చూసి వారు పారిపోయేందుకు ప్రయత్నించటంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద నుండి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.వారిని అరెస్టు చేసి విచారించగా 33 బైకులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. ఈసందర్భంగా కేసుల ఛేదనలో చొరవ చూపిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పనులపై పురోగతిపై సమీక్ష (మొదటిపేజీ తరువాయి)

క్షేత్ర స్థాయిలో ఆకస్మిక పర్యటనలు చేస్తున్నారు. ఈ పర్యటనలోనే అధికారులతో సమావేశం అయ్యి పరిష్కార మార్గాలను చూపిస్తున్నారు. ఇటీవల గూడూరు, నాయుడుపేట డివిజన్ ల్లో పర్యటించిన ఓఎస్డీ , ఇతర అధికారులు కేవలం రెండు రోజుల వ్యవధిలోనే సుమారు 180 ట్రాన్స్ ఫార్మర్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలోనే నేడు ఒంగోలులో విద్యుత్ శాఖ లోని జిల్లా అధికారులతో సమావేశం పేషీ అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లా పరిధిలో నడుస్తున్న ఆర్డీఎస్ఎస్ వర్క్స్ పై రివ్యూ నిర్వహించారు. వీటితో పాటు ఓవర్ లోడెడ్ 33కేవీ ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లు, ఓవర్ లోడెడ్ 33 కేవీ సబ్ స్టేషన్ల మీద, అందుబాటులో ఉన్న మెటీరియల్ మీద కీలకంగా జిల్లా అధికారులతో చర్చించారు. దీనితో పాటు క్షేత్ర స్థాయిలో శాఖలో సిబ్బంది ఖాళీల మీద, పని తీరు మీద అడిగి తెలుసుకున్నారు. మరోవైపు నెమ్మదిగా సాగుతున్న కొత్తపట్నం 132/33 కేవీ పనులను వేగవంతం చేయాలని ట్రాన్స్ కో అధికారులను ఆదేశించారు. 24 గంటల విద్యుత్ సరఫరా పై పలు సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా అధికారులకు మంత్రి రోడ్ మ్యాప్ ఇచ్చినట్లు తెలిపిన ఓఎస్డీ, అతి త్వరలోనే నిర్దేశిత లక్ష్యాలను అందుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖకు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉంటే శాఖాధికారుల దృష్టికి తీసుకు రావాలని పిలుపునిచ్చారు.

నారా రామమూర్తి నాయుడు మృతి పట్ల మాగుంట సంతాపం

విశాలాంధ్ర-ఒంగోలు: ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోదరుడు మాజీ శాసనసభ్యులు కీ.శే. నారా రామ మూర్తి నాయుడు మరణ వార్త తనకు ఎంతో దిగ్భ్రాంతి కలిగించినట్లు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నారా రామమూర్తి నాయుడు టీడీపీ పార్టీ తరపున చంద్రగిరి నియోజకవర్గ శాసనస భ్యులుగా తదితర ఎన్నో పదవులు నిర్వహించి చిత్తూర్ జిల్లా ప్రజలకు ఎనలేని కృషిచేసి ప్రజా నేతగా మంచి గుర్తింపు పొందారన్నారు. నారా రామమూర్తి నాయుడు తనకు చిరకాల మిత్రులు వారి కుటుం బానికి మాగుంట కుటుంబానికి ఎంతో సాన్నిహిత్యం ఉంది మంచితనానికి - మానవత్వానికి ఆయన నిలువెత్తు నిదర్శనమ న్నారు. రామ్మూర్తి నాయుడు లేని లోటు జిల్లాలో తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని సంతాపాన్ని తెలియజేస్తూ,వారి కుటుంబానికి ప్రఘాడ సానుభూతి తెలియ జేస్తున్నట్లు మాగుంట తెలిపారు.

నేడు కామ్రేడ్ సాయిబాబా సంస్మరణ సభ

విశాలాంధ్ర-ఒంగోలు : సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాల యోధుడు, విప్లవ మేధావి కామ్రేడ్ జిఎన్ సాయిబాబా సంస్మరణ సభను ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహి స్తున్నట్ల పౌర సమాజం నాయకులు గుమ్మళ్ల నరశింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ఆదివాసి హక్కుల పోరాట సంఘీ భావ వేదిక జిల్లా కన్వీనర్ ఎ వీరాం జనేయులు అధ్యక్షత వహిస్తారని వక్తలుగా విరసం నేత జి కళ్యాణ రావు, ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కన్వీనర్ చిలక చంద్రశేఖర్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ

విశాలాంధ్ర-ఒంగోలు : పోలీస్ స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పని తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి ఒంగోలు వన్ టౌన్ పియస్‌ను శనివారం జిల్లా ఎస్పీ మీడియా సమావేశం అనంతరం సందర్శించి పోలీస్ స్టేషన్ ఆవరణాన్ని, గదులను, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలు, టౌన్ మ్యాప్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీసి అనేక సూచనలు చేసారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. స్టేషన్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, వారి విధుల వంటి వాటిపై ఆరాతీశారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. డయల్ 112 కాల్స్ పై సిబ్బంది నిత్యం అప్రమత్తంగా అంకితభావంతో చురుగ్గా, సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే వృత్తిపరంగా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. స్కూల్స్, కళాశాల విద్యార్థినిలకు గుడ్ టచ్ అండ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి లాంటి డ్రగ్స్ వలన కలిగే అనర్ధాల గురించి, ప్రజలకు ఫేక్ లోన్ యాప్స్, ఇన్వెస్ట్ మెంట్ లోన్ ఫ్రాడ్స్, ఓటీపీ మోసాలు మరియు ఇతర సైబర్ నేరాలపై విస్తృత అవగాహనా కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాల నెంబర్ ప్లేట్లు యం.వి యాక్ట్ నిబంధనల ప్రకారం ఉండాలని, భయంకరమైన సౌండ్స్ వచ్చే మాడిఫైడ్ సైలెన్సర్‌లు, సైరన్స్ అమర్చి శబ్ద కాలుష్యం సృష్టించి, ప్రజలకు అసౌకర్యాన్ని, భయాన్ని కల్గిస్తే చర్యలు తప్పవని, ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ మరియు వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ వెంట ఒంగోలు డి.ఎస్.పి ఆర్. శ్రీనివాసరావు ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు మరియు సిబ్బంది ఉన్నారు.

18 నుంచి ఈ పంటనమోదు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : రబీ సీజన్లో రైతులు సాగు చేసిన పంటలకు ఈ నెల 18 నుంచి ఈ పంట చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి కె ప్రసన్న రంగ లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. రబిలో సాగుచేసిన పంటలైన వరి, మినుము, మొక్కజొన్న, జొన్న, పప్పు సెనగ మిరప ,పంటలను ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో ఈ పంటనమోదు చేయించుకో వాలన్నారు.

19న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభలు ఈ నెల 19న పొదిలిలోని సాయి బాలాజీ కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయని ,ఏఐఎస్ఎఫ్ నాయకులు పవన్ కళ్యాణ్, ఎస్ రామాంజనేయులు, స్టాలిన్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి, మాజీ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మార్కాపురం సీపీఐ ఇన్చార్జి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె నాసరయ్య పలువురు నాయకులు హాజరవుతారు అన్నారు.

సచివాలయంను సందర్శించిన విద్యార్థులు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : దోర్నాల వృత్తి విద్య కోర్సులో (ఐటీ. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) భాగముగా దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9.10.వ. తరగతి విద్యార్థులు శనివారం ఐన ముక్కల సచివాలయాన్ని సందర్శించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి శివా కోటేశ్వరరావు, విద్యార్థులకు, సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు, వారి విధులను గురించి వివరించారు. పారిశ్రామిక కేంద్రాల పరిశీలనలో భాగముగా సందర్శించిన విద్యార్థులు సచివాలయంలోని విభాగాలు, ఆధార్ గురించి, అన్ని వివరాలు గురించి, ఉద్యోగులు సిబ్బంది, వీధి నిర్వహణ తెలుసుకున్నారు. దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. వి. నారాయణ రెడ్డి , ఐటి ఉపాధ్యాయులు సయ్యద్. నాయబ్ రసూల్ ,మారుతి రెడ్డి , గోపి రెడ్డి , ప్రేమ్చంద్ , అగ్రికల్చరల్ ఉపాధ్యా యురాలు ఎ.సాహిత్య పాల్గొన్నారు.

సమయపాలనపై కఠిన చర్యలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండల కేంద్రమైన వెలిగండ్ల, కంకణంపాడు సచివాలయాలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఒంగోలు అన్నమ్మ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో రికార్డులను, ఉద్యోగుల హాజరు దస్త్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం

జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం చేయాలి
యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్ వి రమణ డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రజాస్వామ్య వ్యవస్థలో 'ఫోర్త్ ఎస్టేట్'గా ఉన్న పత్రికా స్వేచ్ఛపై రోజుకు రోజుకు పెరుగుతున్న దాడులను నివారించేందుకు జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్ వి. రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా ఏపీయూడబ్ల్యుజే ఆధ్వర్యంలో శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా ఇటీవల గత దశాబ్ద కాలంలో జర్నలిస్టులపై అక్రమ కేసులు, మీడియాపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చని అన్నారు. ఏ దేశంలోనైనా పత్రిక స్వేచ్ఛ బలంగా ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ అంతే పటిష్టంగా ఉంటుందన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్ర రాజధాని డెహ్రాడూన్లో ఇటీవల జరిగిన ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయు) జాతీయ కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల రక్షణకు సంబంధించి ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెద్ద సంఖ్యలో జర్నలిస్టులకు అక్రిడేషన్లు అందలేదని, దీంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్డీఏ నూతన కూటమి ప్రభుత్వమైనా ఏటువంటి ఆంక్షలు లేకుండా జిల్లాలోని జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని, అలాగే నివాస స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో విధి నిర్వహణలో మృతి జర్నలిస్టుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని గత ప్రభుత్వం జీవో ఇచ్చిందే తప్ప ఒక్క రూపాయి మంజూరు చేయలేదని, ఈ ప్రభుత్వమైనా వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అలాగే జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎప్పటినుంచో పెండింగ్లోవున్న మజీద్ యా కమిటీ సిఫారసులను అమలు చేయాలని ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షులు ఎన్ వి. రమణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వార్త దినపత్రిక బ్రాంచ్ మేనేజర్, యూనియన్ సీనియర్ నాయకులు మూల అల్లూరి రెడ్డి, ప్రెస్క్లబ్ అధ్యక్షులు డి. మోహన్ రెడ్డి, మాజీ కార్యదర్శి జీవిల్ నరసింహారావు, ఏపీయుడబ్ల్యూజే జిల్లా కోశాధికారి డి. బాబి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కె అన్ను, ప్రెస్ క్లబ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు ఎస్ కె.మహబూబ్ సుభాని, సహాయ కార్యదర్శి బి.సురేష్, యూనియన్ నాయకులు టి.నారాయణ రెడ్డి, వేసపోగు రాజు, వై.సుబ్బారావు, మల్లిఖార్జున రావు,ఎస్ కె.కరీం, ఎస్ కె మస్తాన్, సుబ్రమణ్యం, అదినారాయణ, ఎస్ కె.షౌకత్, డాక్టర్లు రాంబాబు, కిరణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర-కొండపి : జాతీయ మహిళా కమిషన్. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా విధాన్ సే సమాధాన్ , మహిళ న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయ సేవాధికార సంస్థ కందుకూరు కోర్టు వారి ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం కొండపిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పెరుగు శ్రీనివాస ప్రసాద్ హాజరై మాట్లాడుతూ చట్టపరమైన అన్ని విషయాలు పట్ల అవగాహన ఉండాలన్నారు. మండల రెవెన్యూ అధికారి పసుపులేటి మురళి పురుషోత్తమ సమాజం గురించి వివరిస్తూ మహిళలు తమ చుట్టూ తాము గిరిగీచుకొని జీవిస్తున్న జీవితాన్ని విడనాడాలన్నారు. ఎంపీడీవో రామాంజనేయులు మాట్లాడుతూ బాలల దినోత్సవ సందర్భంగా నవంబరు 14 నుండి 20 వరకు జిల్లా వ్యాప్తంగా జరుపుకుంటున్న బాలల వారోత్సవాలు యొక్క విధి విధానాలను వివరించారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చేయాలన్నారు. కందుకూరు కోర్ట్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు పి.పణి కుమారి, కె సులోచనలులి మహిళలపై ఉన్న పలుచట్టాలను నిశితంగా వివరించారు. డిఆర్డిఏ డిపిఓ నరసింహారావు మహిళలపై,పిల్లలపై జరుగుతున్న జరుగుతున్న అఘాత్యాలను సంఘటితంగా ఎదుర్కోవాల న్నారు. ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ పురాతన కాలం నుండి మహిళలను చిన్నచూపు చూస్తున్న విధానాన్ని కళ్ళకు కట్టినట్టు చూపించారు. కార్యక్రమానికి ఏ.పి.ఎం. బి.గోపీనాథ్ అధ్యక్షత వహించగా హైకోర్టు జూనియర్ న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు వందన సమర్పణ గావించారు. సభ అనంతరం పర్యావరణ పరిరక్షణకై కందుకూరు కోర్టు వారు సభకు హాజరైన వారికి జ్యూట్ బ్యాగులు అందించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సురేఖ పారా లీగల్ వాలంటర్లు గంగుల హరిబాబు, మస్తాన్ మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర-ముండ్లమూరు : 108 వాహనంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో ఆర్ జనార్దనకు శనివారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 వాహనాలను ప్రభుత్వమే నిర్వహించాలని, ఏరియర్స్తో కలిపి పెండింగ్లో ఉన్న ఇంక్రిమెంట్లు చెల్లించాలని, దీర్ఘకాలంగా తాము అందిస్తున్న సేవలను గుర్తించాలని 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని, సహజ మరణం ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీలు చేయాలని, 108 సేవలో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఈఎంటి కందిమల్ల వెంకటరావు, ఈఎంటి కోలా వర కుమార్, పైలట్ దారాకోటయ్యలు వినతి పత్రాలు అందజేశారు.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : బాలల హక్కులు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని మండల విద్యాశాఖాధికారి జి సుబ్బయ్య అన్నారు. బంగారు బాల్యం వారోత్సవాలలో భాగంగా శనివారం వికే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక పోటీలు నిర్వహించి, ర్యాలీ నిర్వహించి బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ' మనం మన కోసం ' అనే అంశంపై వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతి, ఎంఈఓ -2 సుధాకర్ రావు, ప్రధానోపాధ్యాయులు శేషగిరి రావు తదితరులు పాల్గొన్నారు. వెలుగు వారి పాలెం ప్రాథమిక పాఠశాల (ఏపి) వారోత్స వానికి కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యా యుడు సుబ్బారెడ్డి అంగన్వాడి టీచర్ సునీత పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : 57వ జాతీయ గ్రంథాల య వారోత్సవాల సందర్భంగా గ్రంథాలయ ఉద్యమమునకు పాటుబడిన గ్రంథాలయ ఉద్యమకారులైన టువంటి ఎస్సార్ రంగనాథన్కి అయ్యంకి వెంకట రమణయ్యకి గాడిచర్ల హరి సర్వోత్తమరావుకి పాతూరి నాగభూషణంల చిత్రపటములకు శనివారం దోర్నాల పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, దోర్నాల హెచ్ రామ్ నాయక్, పిడి ఎం గోపిరెడ్డి, గ్రంథాలయ ఉద్యమకారుల గురించి విద్యార్థిని విద్యార్థులకు ఉపన్యసిం చడం జరిగింది. ఈ కార్యక్రమము గ్రంథపాలకుడు దొండపాటి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు., తదుపరి విద్యార్థినీ విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో నాగమూర్తి, అసిస్టెంట్ హెచ్ఎం ఎం గోపి రెడ్డి , టీచర్ డివి సుబ్బారెడ్డి, గ్రంథ పాలకుడు వీరు జడ్జిలుగా వివరించడం జరిగింది ఈ పోటీలను గ్రంథపాలకుడు దొండపాటి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేద్దాం

విశాలాంధ్ర-ముండ్లమూరు : చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు ఏర్పాటే లక్ష్యంగా బంగారు బాటలు వేద్దామని ఎంపీడీవో ఆర్ జనార్దన్ అన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం బంగారు బాల్యం బాలోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోకుండా బాల్యాన్ని సంతోషంగా గడపాలన్నారు. తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక ఉన్నత లక్ష్యం కోసం ఇప్పటినుండి కృషి చేయాలన్నారు. ఎంఈఓ జే సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థి దశలో చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాన్ని సాధించాలన్నారు.వైద్యాధికారి జె వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త ల గురించి వివరించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ ఏ సునీత మాట్లాడుతూ తల్లిదండ్రులకు విద్యార్థి యొక్క ప్రాముఖ్య తను విద్యార్థులకు తెలియపరచి బడి మానివేయకుండా అవగాహన కల్పించారు. అంగన్వాడీ సూపర్వైజర్ బి సునీత మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలంటే విద్యార్థుల దశ నుంచే మార్పు రావాలని తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కోఆర్డినేటర్ టి డేవిడ్, ఉపాధ్యాయులు వై పద్మజ, పి మాలతి. కే రత్నమాలిని దేవి, కే శారా, పాల్గొన్నారు.

విజయ్ కుమార్కు అభినందనలు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాల సంక్షేమ ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ గా నియామకమైన డాక్టర్ పెదపూడి విజయ్ కుమార్కు ఉప్పుగుండూరు బీఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆయన స్వగ్రామమైన ముప్పాళ్ళలో ఆయనను కలిసి అభినందనలు తెలియ జేశారు. ఉన్నత విద్యావంతుడు విజయ్కుమార్ను రాష్ట్ర చైర్మన్గా నియమించడం సంతోషమని ఫౌండేషన్ కోఆర్డి నేటర్లు గద్దె త్యాగరాజు, కొండ్రు దాసు తెలియజేశారు. ఫౌండేషన్ నాయకులు యండ్రపాటి చంద్రశేఖర్, కొండా శీను బండారు సురేష్, కత్తి పవన్, శ్యామ్ మధు పాల్గొన్నారు.

వాడి వేడిగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. అధికారులకు నాయకులకు మధ్య మాటల సమావేశం మొదలు పూర్తి అయ్యేవరకు గొడవ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సి ఐ అస్సాన్, యస్ ఐ శివ బసవరాజు ఆధ్వర్యంలో సర్కిల్ పోలీసులతో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేశారు. గేటు వద్ద పోలీసులు సాధారణ ప్రజలను అడ్డుకొని కేవలం ప్రజా ప్రతినిధులు మాత్రమే లోపలికి అనుమతించారు. అనంతరం మొదలైన సర్వసభ్య సమావేశం ఇన్చార్జి ఎంపిపి రిబకమ్మ అధ్యక్షతన, ఎంపిడిఓ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో మొదలైంది. మొదట అధ్యక్షురాలు రిబాకమ్మ తన ఆరోగ్య పరిస్థితి బాగాలేదని సమావేశం మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆగ్రహించిన కొందరు ప్రజాప్రతినిధులు అధ్యక్షురాలు లేకుండా సమావేశంలో ఎవరితో మాట్లాడాలి అంటూ అసహనం వ్యక్తం చేసి సమావేశం నిలిపివేశారు. దీంతో ఎంపిడిఓ రాజ్ కుమార్ సమావేశం మందిరం నుంచి వెళ్లి రిబకమ్మను సమావేశ మందిరం లోపలికి తీసుకువచ్చారు. మొదట విద్యా శాఖ అధికారులు సమావేశంలో మాట్లాడుతుండగా బాల్య వివాహాలు అనే విషయం ప్రస్తావనకు రాగ ప్రాదేశిక సభ్యులు అయిన ఆళ్ళ ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు ప్రతి గ్రామంలో జరుగుచున్నవి వాటిని ఎందుకు అరికట్టలేక పోతున్నారని ప్రశ్నించారు. అధికారులు అందరూ కళ్ళుమూసుకుని వుంటే అధికారి ఎంత వరకు చూడగలరు అని అధికారులు సమాధానం ఇచ్చారు. దీనికోసం ప్రత్యేక కమిటీ వేయడం జరిగింది అన్నారు. కమిటీ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాము. తాము కలుగజేసుకుంటే పొలిటికల్ సమస్య అవుతుంది కాబట్టి మేము మీకు విషయం తెలియపరచలేమూఅని నాయకులకు సమాధానం ఇచ్చారు. చట్టంపై ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధులు అవగాహన కలిగి ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించాలి తెలిపారు. అనంతరం ఐసిడిఎస్ అధికారులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐసిడిఎస్ వారు అవగహన కలిపించడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని విన్నవించుకున్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ మరియకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో పని చేస్తే రాజకీయ రంగు పులుముతూన్నారు. కో ఆప్షన్ మెంబర్ నయీం బేగ్ మాట్లాడుతూ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్న నాయకులకు సమాచారం అందించడం లేదు అన్నారు. నీటి సరఫరా సమీక్షలో జలజీవన్ మిషన్లో కొన్ని గ్రామాల్లో మంజూరు అయ్యి పని జరగక నిలుపుదల చేయడం జరిగింది అని ఆర్ డబ్ల్యు యస్ ఏ ఈ శ్రీకాంత్ అన్నారు. ఈ విషయమై ఎంపిడిఓ ప్రతి పంచాయితీకి బోర్ కు సంబంధించిన రిజిస్టర్ మెయింటెన్ చేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మిట్టపాలెం,రామసముద్రం,దువ్వాలి,లేలపల్లి,నీటి సమస్య వుందని గ్రామ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని అయన తెలిపారు. గతంలో చేతి పంపులకు కొత్త సామానులు ఇవ్వడం జరిగింది ఇప్పుడు ఇవ్వక పోవడం వలన సమస్య ఎదురవుతుంది అని ప్రతినిధులు ప్రశ్నించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ అధికారులను,ప్రజా ప్రతినిధులను ఏకవచంతో పిలిచి సభను అగౌరవ పరచవద్దని అయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులకు సహకరిస్తే మండల అభివృద్ధికి పాటు పడతామన్నారు. పశువుల షెడ్డు ఏ అర్హతతో ఎంపిక చేయడం జరిగింది తెలుపాలని అంజనేయ రెడ్డి ప్రశ్నించారు. లాటరీ పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందనీ ఎంపిడిఓ తెలిపారు. ఇలా మరికొన్ని శాఖలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్,ఎంపిడిఓ రాజ్ కుమార్,వ్యవసాయ అధికారిని నీరజా,విద్యాశాఖ అధికారి తులసీ మల్లికార్జున నాయక్,పంచాయితీ రాజ్ ఏ ఈ వెంకట సుబ్బయ్య,ఆర్ డబ్లూ యస్ ఏ ఈ శ్రీకాంత్,ఉద్యానశాఖ అధికారి ఆదిరెడ్డి,గృహ నిర్మాణ శాఖ ఏ ఈ శ్రీనివాస్,నీటిపారుదల శాఖ ఏ ఈ శివన్నారాయణ,ఈఓపీఆర్డి రామ సుబ్బయ్య,వైద్య శాఖ అధికారి నాగేశ్వరావు నాయక్, ఏపిఓ సుజాత, అన్నిశాఖల అధికారులు అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తి నాయుడు మృతికి బైరెడ్డి, దారపనేని సంతాపం

విశాలాంధ్ర-పామూరు : చంద్రగిరి మాజీ శాసనసభ్యులు నారా రామ్మూర్తి నాయుడు మృతి పట్ల కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు, సి ఎస్ పురం మాజీ సింగిల్ విండో చైర్మన్లు బైరెడ్డి జయరామిరెడ్డి, బోయిళ్ళ నారాయణరెడ్డిలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజకీయాలలో మచ్చలేని నాయకుడిగా ప్రజలకు నిరంతరం సేవలు చేసిన రామ్మూర్తి నాయుడు మరణం చంద్రగిరి నియోజకవర్గానికి తీరని లోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు పేర్కొన్నారు. నుచ్చుపొద ఫీషర్ కమిటీ మాజీ సభ్యులు కౌలూరి ఖాజా రహమతుల్లా, యర సింగ్ రాయుడు, మట్లె రాహుల్ యాదవ్ తదితరులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పుష్కలంగా సాగర్ నీరు

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సాగర్ నీరు పట్టణానికి పుష్కలంగా అందు తున్నాయని మేజర్ పంచాయతీ కార్యదర్శి జివి అరవింద రెడ్డి అన్నారు. శనివారం ఆమె పట్టణంలోని సాగర్ నీరు నింపుతున్న బావిని పరిశీలించారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కారమునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తెలుగు యువత నాయకులు చౌదరి, మాజీ ఎంపీటీసీ ఇరి కోటిరెడ్డి సూపర్వైజర్ రాఘవులు ఉన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-టంగుటూరు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మూడవరోజు శాఖా గ్రంథాలయం టంగుటూరులో ఘనంగా నిర్వహించారు. టంగుటూరులోని గవర్నమెంట్ హై స్కూల్ శ్రీ చైతన్య హై స్కూల్ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ చైతన్య హై స్కూల్ కరస్పాండెంట్ రాజు ఆయుర్వేద డాక్టర్ ప్రియాంక హాజరయ్యారు. గ్రంథాలయ పితామహులు ఎస్సార్ రంగనాథ పాతూరి నాగభూషణం అయ్యంగి వెంకట రమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. శాఖ గ్రంథాలయ నిర్వాహకులు, గుమ్మడి వర్ధన రాజు మరియు టంగుటూరు స్థానికులు రిటైర్డ్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ మహిళా కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-టంగుటూరు : స్థానిక వల్లూరులోని రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూప్ కళాశాలలో జేఎన్టీయూ కాకినాడ నిర్వహించు సెంట్రల్ మహిళా కబడ్డీ ఇంటర్ కాలిజాట్, సెలెక్షన్ ట్రైల్స్ అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జేఎన్టీయూ యూనివర్సిటీ క్రీడల కార్యదర్శి డాక్టర్ జి శ్యామ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. రైజ్ కళాశాల ట్రెజరర్ శిద్దా భరత్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల పట్ల ఆసక్తి కలిగే విధంగా రైజ్ కళాశాలలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో బాస్కెట్బాల్ టెన్నిస్ కోర్ట్ లను ఏర్పాటు చేసినట్లు రాగా చీఫ్ కోఆర్డినేటర్ శిద్దా ప్రవళిక తెలిపారు. రైజ్ కృష్ణ సాయి కళాశాలలో యూనివర్సిటీ పరిధిలోని మొట్టమొదటిసారిగా ప్రో కబడ్డీ మ్యాచ్ పై మహిళా కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించడం హర్షించదగిన విషయమని యూనివర్సిటీ క్రీడల కార్యదర్శి మరియు అబ్జర్వర్ డాక్టర్ జి శ్యామ్ కుమార్ రైజ్ కళాశాల యాజమాన్యంనకు ప్రిన్సిపాల్‌కు , సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. మొదటిరోజు జరిగిన పోటీలలో రెండో రౌండ్ కి రైజ్ కృష్ణ సాయి గాంధీ ఒంగోలు, సెయింట్ మేరీస్ గుంటూరు. పేస్ ఇంజనీరింగ్ ఒంగోలు, జేఎన్టీయూకే కాకినాడ. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్, ఎంఎల్సి విమెన్ గుంటూరు కళాశాల వారు ఎంపికైనరుని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నారు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవి సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రబాబు, పాల్గొన్నారు.

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ వేగి నాటి ఓసూరారెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్, జడ్పీ సీఈఓ ఆదేశాల మేరకు బేస్తవారిపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక గురించి నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఎంపిడీఓ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ ల ద్వారా 19 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణ మరియు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు బి. వెంకట రాజు, వైస్ ఎంపీపీ డి. ఖాజామియా సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర-సింగరాయకొండ : అక్రమ మద్యం విక్రయిస్తున్నాడని సింగరాయకొండ మండల పరిధిలోని మూలగుంటపాడు గ్రామం పొనుగోటివారిపాలెం కాలనికి చెందిన పొనుగోటి జగన్‌ను శనివారం ఎక్సైజ్ సీఐ శివకుమారి అరెస్ట్ చేశారు. అక్రమ మద్యం విక్రయిస్తున్నాడని సమాచారంతో మూలగుంటపాడు మద్యం షాప్ ఎదురుగా కూల్ డ్రింక్ షాప్ నడుపుకుంటున్న పొనుగోటి జగన్ వద్ద నుండి 8 అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి చేయాలి

విశాలాంధ్ర-కొండపి : మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపించే విధంగా అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని మండల ప్రత్యేక అధికారి హౌసింగ్ పీడీ ఎం వెంకటస్వామి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శనివారం సాధారణ సమీక్ష సమావేశాన్ని వెంకటస్వామి నిర్వహించారు. వివిధ శాఖల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి రామాంజనేయులు, మండల విద్యాశాఖ అధికారిని కే సురేఖ, సిడిపిఓ మాధవి, ఏపీవో మహాలక్ష్మి ఐసిడిఎస్ సూపర్వైజర్ విక్టోరియా రాణి తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : జాతీయ పత్రికా దినోత్సవం పురస్కరించుకుని పుల్లలచెరువు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు నేటి సమాజంలో పత్రికా మరియు పాత్రికేయుల పాత్రపై మండల పాత్రికేయుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విజేతలైన విద్యార్థులకు మొదటి, ద్వితీయ,తృతీయ బహుమతులు పాత్రికేయులు అందజేశారు. మాజీ ప్రకాశం జిల్లా కార్యవర్గ సభ్యులు జి గురునాథం మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి,చెడు ప్రజలకు,ప్రభుత్వానికి తెలియజేసేవారే పాత్రికేయులని అన్నారు. సమాచార చర్యను ప్రోత్సహించడం ద్వారా, పాత్రికేయులు మరింత పారదర్శకమైన, ప్రజాస్వామ్య సమాజానికి దోహదం చేస్తారన్నారు. జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో పాత్రికేయులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పాత్రికేయులు పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మండల ప్రింట్ అండ్ ఎలాక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సాక్షి విలేఖరి ఎన్ వెంకోబారావు. ఆంధ్రప్రభ విలేకరి కే పురుషోత్తం, పెన్ పవర్ విలేఖరి, ఏసోబు, వార్త విలేకరి నాగేంద్రబాబు, సూర్య గురవయ్య, కె కృష్ణయ్య, ఉదయ్ ఛానల్ లేకరి ఎల్ అనిల్, ఎస్ ఆర్ ఆర్, ఛానల్ విలేకరి, కే నాని, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న కాసిం ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి 8 గంటల సమయంలో జరిగింది. వివరాల ప్రకారం దొనకొండలో కాపురం ఉంటూ ప్రతిరోజు డ్యూటీ నిమిత్తం కురిచేడు మండల తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో శనివారం డ్యూటీకి వచ్చి డ్యూటీ ముగించుకొని దొనకొండకు పోవుటకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న సమయంలో కురిచేడు నుంచి పొట్లపాడు గ్రామ ముందు ఉన్న దొను చప్టా వద్ద ప్రమాద వశాత్తూ తన వాహనము అదుపుతప్పి క్రింద పడగా కాసిం చప్టా నుంచి క్రింద పడగా తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

పోలీసుశాఖలో నిఘా విభాగం కీలకం

◆ నిబద్ధతతో సమర్థవంతంగా విధులు నిర్వహించాలి
◆ ముందస్తు సమాచారాన్ని వేగవంతంగా సేకరించాలి
◆జిల్లా ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లా పోలీస్ శాఖలో నిఘా విభాగం విధులు కీలకమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా నిఘా విభాగ పోలీసులతో ఎస్పీ సమీక్షా నిర్వహించారు. నిఘా విభాగంలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ముందస్తుగా నిగూఢ రహస్య సమాచారం సేకరించవలసిన విధానం,వ్యవహరించవలసిన తీరు తదితర విషయాల గురించి సమీక్షించి తగిన సూచనలు, మెళకువలు తెలియజేశారు. పోలీస్ శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు,అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయడానికి ముందస్తు సమాచారం వేగవంతంగా సేకరించడం కీలకమని ఎస్పీ తెలిపారు. ముందస్తు సమాచారం సేకరించడం వలన ఆదిలోనే నేరాలను అరికట్టి శాంతి భద్రతలను పరిరక్షించవచ్చునన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందని గ్రహిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అమ్మకం,వినియోగం వంటి వాటి మీద ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు.

జిల్లాలో ఎక్కడైనా పేకాట,కోడిపందాలు వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు గురించిన ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. కచ్చితత్వంతో కూడిన సమాచారం వేగవంతంగా సేకరించి అందించాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన,నిగూఢ రహస్య సమాచారం సేకరించడంలో అలసత్వం వహించిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏస్.బి సిఐ నారాయణ,జిల్లా ఏస్.బి అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - అద్దంకి : మెట్ల పైనుంచి జారిపడి వృద్ధునికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం అద్దంకిలోని శాంతి విత్తనాల దుకాణం వద్ద జరిగింది. మండలంలోని కొటికలపూడి గ్రామానికి చెందిన కోవి హనుమంతరావు (65) పంట పొలానికి విత్తనాలు కొనుగోలు చేసేందుకు అద్దంకిలోని పాత పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న శాంతి విత్తనాల దుకాణం వద్ద మెట్లు ఎక్కుతుండగా జారిపడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అతనిని 108 మెడికల్ టెక్నీషియన్ హరిబాబు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం బాధితుని సమ్మతి మేరకు బంగ్లా రోడ్డులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - అద్దంకి : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్,పాతూరి నాగభూషణం, వెంకటరమణయ్య ఉద్యమకారులను స్మరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథ పాలకులు చుండూరి సుగుణరావు,విశ్రాంత బ్యాంకు ఉద్యోగి దివాకర్ దత్తు,రవీంద్ర భారతి స్కూల్ హెచ్ఎం మోహన్‌రావు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామని గ్రంథాలయ అధికారి శివాజీ గణేషన్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు స్కూల్స్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ స్కూల్స్ ఉపాధ్యాయులు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం రచయితల సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.మల్లికార్జున్,ఖాన్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లను నాణ్యతతో నిర్మించాలి

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లను నాణ్యతతో నిర్మించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాపట్ల మండలం పశ్చిమ బాపట్ల వైయస్సార్ నగర్‌లో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత సీసీరోడ్లను ఆయన పరిశీలించారు. వలస కూలీలను నివారించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అన్నారు. ఉపాధి లేదనే కారణంతో జిల్లాను విడిచి ఎవరు వెళ్లరాదన్నారు. పొరుగు జిల్లాలకు లేదా పొరుగు రాష్ట్రాలకు వెళ్లకుండా స్వగ్రామంలోనే వారికి ఉపాధి పనులు చూపించాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలోనూ వలసలు ఉన్నట్లు తెలియడంపై గ్రామంలో ఆయన పర్యటించారు. నిరుపేదల కొరకు మాత్రమే ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. చేపట్టే నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కూలీలకు కనీస వేతనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులలో అక్రమాలు చోటుచేసుకోకుండా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట డ్వామా పిడి విజయలక్ష్మి, తహసీల్దార్లు సలీమా, ఇంజినీర్లు, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్నం భోజనం తనిఖీ

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం ప్రాథమిక పాఠశాల,ఉన్నత పాఠశాలలను ఎంపీడీవో శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి,విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. మెనూ ప్రకారం జరుగుతుందా లేదా అని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో బలోపేతం చేయడానికి అందరు కృషి చేయాలని,విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. కర్లపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుమాధవ్, ఈ.పోలీసురావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇనిస్పెక్టర్ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై బి.శ్రీహరి సిబ్బందితో కలిసి దేవాంగపురి, పాతచీరాల, రామనగర్,కాపూరి వారి పాలెం, గవినివారిపాలెం, పిట్టువారి పాలెం తదితర ప్రదేశాలలో దాడులు నిర్వహించారు. కాపూరివారిపాలెంలో ఒక మహిళను అదుపులోకి తీసుకుని 13 ఓల్డ్ టావరిన్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎక్సైజ్ చట్ట ప్రకారం మద్యం సీసాలు కలిగి ఉండడం,రవాణా చేయడం,అమ్మడం నేరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో చీడపీడల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన పంట నష్టం అంచనా వేసేందుకు మండల వ్యవసాయాధికారి ఐ.సుమతి, వ్యవసాయ సహాయకులు కలిసి వాడరేవు,బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం,గవినివారిపాలెం గ్రామాల్లో క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షపాతం సరాసరి 87.8 ఎం.ఎంగా నమోదు అయ్యిందన్నారు. వరి పంటకు ఎటువంటి నష్టము లేదన్నారు. అన్ని గ్రామాల్లో కలుపుకొని మండలంలో 1000 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న పంట సాగు చేశారన్నారు. అందులో యాభై ఎకరాల పల్లపు ప్రాంతాల పొలాలకు నష్టం వాటిల్లిందన్నారు. మొక్కజొన్న వేసేటట్లయితే పొలం పూర్తిగా ఆరిన వారం పది రోజుల తర్వాత వేయవలసి ఉంటుందని,మినుము పంట వేయదలిస్తే 40 రోజుల తర్వాత సాగు చేయాలన్నారు. మొక్కజొన్న పంట నిర్వహణ గురించి, చీడపీడల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రమేష్,హదస్సా,శ్రావ్య,ప్రసన్న, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బలుసులపాలెంలో టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : తెలుగుదేశం పార్టీ సుస్థిర పాలన కోసం సంక్షేమ పథకాల అమలు కోసం నిరంతరం కృషి చేస్తుందని గ్రామ సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి కుమారుడు రవి కిరణ్ అన్నారు. శనివారం గ్రామ పరిధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు పేరం శంకర్ బాబు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాటూరి శ్రావణ్ కుమార్ నరసింహారావు,వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - కారంచేడు : మండల పరిధిలోని స్వర్ణ గ్రామ సచివాలయంలో ఎం.ఆర్.ఓ అనిత శనివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందికి సంబంధించిన కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వటంతో ఆగ్రహం వెలిబుచ్చారు. కార్యాలయానికి చెందిన పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ఈ విధమైన సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరించారు..

టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : టీడీపీ కార్యకర్తలు,అభిమానులు తప్పనిసరిగా టీడీపీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు నిజాంపట్నం మండల టీడీపీ కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

పార్టీ కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. శాశ్వత సభ్యత్వ నమోదుకు రూ. లక్ష, సాధారణ సభ్యత్వ నమోదుకు రూ. 100 రుసుము చెల్లించాలన్నారు. గతంలో ప్రమాద బీమా రూ. 2 లక్షలు ఉండగా ప్రస్తుతం రూ. 5 లక్షలకు పెంచారని చెప్పారు. సభ్యత్వ నమోదు చేసుకున్న ప్రతి ఒక్క కార్యకర్తకు రూ. 5 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

విశాలాంధ్ర - చీరాల : నియోజకవర్గం నుంచి ఉత్తమ ఉపాధ్యాయునిగా రాష్ట్ర ప్రభుత్వంచే అవార్డును పొందిన పవని భానుచంద్రమూర్తిని శనివారం ఘనంగా సన్మానించారు.ఆంధ్రరత్న హైస్కూల్లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పవని భానుచంద్ర మూర్తి 2024 రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కగా శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్ రాజు,స్టాఫ్ సెక్రెటరీ వై.గాంధీ తదితరుల సమక్షంలో మండల విద్యా శాఖాధికారులు భానుని సన్మానించారు.ఈ కార్యక్రమంలో కె.రాజేంద్ర ప్రసాద్,వెలుగొండారెడ్డి యల్ల మందేశ్వరరావు,రమణరావు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ పీవోఏ చట్టంపై అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో గుంటూరు సి.ఐ.డి ఆర్వో సిఐడి అడిషనల్ డీజీ రవిశంకర్ అయన్నార్ పర్యవేక్షణలో గుంటూరు సిఐడి అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ పిఓఏ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సాంఘీక సంక్షేమ శాఖ డీడీ రాజదెబోరా ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.కార్యక్రమానికి హాజరైన విధ్యార్థులను ఉద్దేశించి ప్రముఖ దళిత నేతలు డాక్టర్ జి.చార్వాక,కాగిత కోటేశ్వరరావు, పల్లం సరోజిని, విజయ్ కుమార్, గుదే రాజారావు, రాజు సల్మాన్, కూచిపూడి ఝాన్సీ, యలమంద, వందనం, జవహర్ , రోషన్ ప్రసంగించారు. అనంతరం ఎస్సీ ఎస్టీ పి.ఓ యాక్ట్‌పై విద్యార్థులకు పలు అంశాలపై రాతపరీక్ష నిర్వహించి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఐడీ సీఐలు తిరుమలరావు , విక్టర్ సిబ్బందిలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని మండల అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్ సుభాని అన్నారు. జిపిడిపి శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సంఘ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు.పెద్దపల్లి త్యాగరాజు డ్వాక్రా వివో యానిమేటర్లతో డ్వాక్రా సంఘ బలోపేతానికి తీసుకోవలసిన విషయాలను గురించి వారికి వివరించారు.జిపిడిపిలో మహిళలను కూడా భాగస్వాములను చేసి గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో కే. శ్రీనివాసన్,మండల పరిషత్ కార్యాలయ అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో శానిటేషన్ పనులు

విశాలాంధ్ర - రేపల్లె : ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే ప్రజల మన్ననలు పొందవచ్చునని రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు తెలియచేశారు.కోర్టు పరిసరాలలో ఉన్న పిచ్చి చెట్లను తొలగించి,ప్రాంగణం మొత్తం ఊడ్చి శుభ్రపరిచారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేసన వెంకట గోపాలరావు,శానిటరి ఇన్స్పెక్టర్ ఆకురాతి రామ చంద్రరావు, సెక్రెటరీ సురేంద్ర కుమార్,కోర్టు సూపరిండెంట్స్ పి.సుజాత, కె.కనకాంబరం,యన్.నాగేశ్వరరావు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్లు త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలో అన్ని గ్రామాలలో సీసీ రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో మహమ్మద్ అఖిద్ జావిద్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల ఉపాధ్యక్షురాలు దొడ్డా ఇంద్రదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన పశు వైద్యాధికారి బి.సురేష్ బాబుకు సమావేశంలో నివాళులర్పించారు. .ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ విష్ణు,సూపర్వైజర్ సుజాత ఎంపీటీసీ గొట్టిపాటి సతీష్,సాదినేని రంగారావు,పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పులు అవసరం

విశాలాంధ్ర - నిజాంపట్నం : అసాంక్రమిత వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ జీవన విధానంలో మార్పులు చేసుకోవాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రణవి సూచించారు.మండలంలోని నక్షత్ర నగరలో వైద్య సిబ్బందితో ఇంటింటి ఎన్సీడీ సర్వే చేయించారు.

అలాగే హరీస్ పేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు జరిపి వారి యొక్క ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ సాంబశివరావు,సిహెచ్ఓ మరియా రాణి,సూపర్వైజర్ మురళి,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సబ్సిడీ ఖాతాల్లో జమ ఎన్నడు...

చల్లా రామయ్య

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో కూటమి ప్రభుత్వంలో ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్‌లు ఇబ్బందులు పెడుతున్నారని వైఎస్ఆర్సిపి ది వ్యాంగులు విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య చల్లా రామయ్య ఆరోపించారు. పట్టణంలోని గ్యాస్ కంపెనీల వద్ద ఉచిత సిలిండర్లు డబ్బులు తమ అకౌంట్లలో జమ కావట్లేదని మహిళలు ఆందోళన తెలియజేస్తున్న కార్యక్రమంలో చల్లా రామయ్య హాజరైయ్యారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఎన్నికల ముందు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముందుగా మహిళల గ్యాస్ సిలిండర్ల కొరకు ముందుగా డబ్బులు చెల్లించిన తర్వాత 48 గంటల్లో డబ్బులు ఖాతాల్లో జమ చేస్తామని మహిళలకు తెలియజేశారని ఇప్పటికీ మూడు వారాలు గడిచిపోతున్నా డబ్బులు పడకపోగా ఎన్నో ఆంక్షలు పెట్టి మహిళలకు ఇబ్బందులు గురి చేస్తున్నారని తెలియజేశారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేద వర్గాలకు అక్కా చెల్లెమ్మలకు అందరికీ కూడా వాలంటరీ వ్యవస్థ ద్వారా ఇంటి వద్ద సంక్షేమ పథకాలు అందించారని చల్లా రామయ్య తెలియజేశారు. ఎన్నో హామీలు చెప్పిన కూటమి ప్రభుత్వానికి రేపు రాబోయే ఎన్నికలలో ప్రజలే బుద్ధి చెబుతారని ఇప్పటికైన ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో మహిళలకు న్యాయం జరగకపోతే పోరాటం చేస్తామని చల్లా రామయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జగనన్న సైనికులు ఆకురాతి విష్ణుమూర్తి, కత్తుల వెంకటేశ్వర్లు, భోగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పేద మహిళలు పాల్గొన్నారు.

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

కార్పొరేట్ కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, ప్రాంతీయ కార్యాలయం: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డి.నం.54-20-10/1ఎ, 3వ అంతస్తు, గురునానక్ కాలనీ, మెయిన్ రోడ్డు, ఎస్బీఐ ఎదుట, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520008.
CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

అనుబంధం-4-ఎ [(నిబంధనల 8(6) చూడుము)] ఇ-వేలం మరియు విక్రయం కొరకు బహిరంగ ప్రకటన(అనుబంధం-4-ఎ), (నిబంధన 8(6))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ , 2002 (ఇకమీదట "చట్టం") కింద 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై - 600 015 వద్ద కార్పొరేట్ కార్యాలయం మరియు హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్. డోర్ నెం. 54-20-10/1ఎ, 3వ అంతస్తు, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా, విజయవాడ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్-520008 నందు బ్రాంచ్ కార్యాలయం కలిగియున్న హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్)కి తనఖా పెట్టిన స్థిరాస్తి అమ్మకం. రూ.3,70,289 ల బకాయిలను రాబట్టుకునేందుకు హెచ్‌హెచ్‌ఎఫ్ అధీకృత అధికారి ("ఏఓ") "ఎచ్చట ఉన్నది ఉన్నట్లు & ఏముంటే అది ప్రాతిపదిక"పై విక్రయించే హక్కుతో చట్టంలోని 13(12) కింద జారీ చేసిన నోటీసు ప్రకారం స్వాధీనం చేసుకున్న ఈ కింద పేర్కొన్న రుణ ఖాతాల్లో హామీగా పెట్టబడిన ఆస్తి/లను విక్రయించెదరు. దిగువ సంతకందారు వెబ్‌సైట్: www.bankeauctions.comలో ఏర్పాటు చేసిన ఇ-వేలం వేదిక ద్వారా విక్రయాన్ని నిర్వహించెదరు.

వ. సం.	రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/హామీదారు(లు)	డిమాండ్ నోటీసు తేదీ మరియు బకాయి	మొత్తం బకాయి	స్వాధీనత తేదీ	రిజర్వు ధర	ఆస్తి తనిఖీ చేసే తేదీ
1.	1. శ్రీ రామకృష్ణ పల్లపు, 2. శ్రీమతి వెంకట శాంతి శృంగరపు. ఆర్/ఓ. డోర్ నెం: 17-345, విద్యా నగర్, ఆర్‌కే రెసిడెన్సీ, ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర, బ్యాంక్ కాలనీ, మార్టూరు మండలం, ప్రకాశం, ఆంధ్ర ప్రదేశ్ - 523301 రుణఖాతా సంఖ్య: AP/VWD/VJDA/A000000598	31-07-2024 రూ. 26,91,986	11-11-2024 నాటికి మొత్తం బకాయి రూ. 27,64,493	25-10-2024	రూ. 89,62,080	10-12- 2024 ఉ.11.00 నుంచి 14.00 గం. ఇఎండి చివరి తేదీ: 19-12-2024 సా.5 గం.వరకు
				బిడ్ పెంపుదల మొత్తం: 10,000/-	ఇఎండి: రూ.8,96,208	ఇ-వేలం తేదీ/సమయం: 20-12-2024 ఉ.11.00 నుంచి 13.00 గం.

స్థిర ఆస్తి/హామీగా పెట్టిన ఆస్తి యొక్క వివరాలు: ఐటెమ్ సం: 1 (4074/2006) ప్రకాశం జిల్లా, మార్టూరు ఎస్ఆర్ఓ, మార్టూరు మండలం, మార్టూరు గ్రామం, మార్టూరు గ్రామపంచాయతీ ఏరియా, అసెస్‌మెంట్ సం: 2392, ఆస్తి డోర్ నం.7-345, దగ్గరి డోర్ నం: 6-13, సర్వే నం.608/ఎ, సి, 4,ఎ 601/సి,3 లో ఉన్న 216 చదరపు గజాలు లేదా181.44 చదరపు మీటర్ల స్థలంలో నిర్మించిన అన్ని అనుభవ హక్కులు కలిగియున్న గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్తు ఆర్.సి.సి. భవనం మరియు భూమి మొత్తంగా. హద్దులు: తూర్పు: ఈ ఆస్తి మరియు తేలప్రోలు శ్రీనివాసరావు మరియు దొడ్డ వీర బ్రహ్మానందం ఆస్తికి చేరుకునేందుకు విడిచి పెట్టిన 10 అ॥ల వెడల్పు దారి - 34 అ॥లు. దక్షిణం: కె.చిన వెంకట సుబ్బారావుకు చెందిన స్థలం. మరియు ఐటెమ్ నం: 2: 2-57 అ॥లు, పడమర: తిరువాయిపాటి రాంబాబుకుచెందిన ఇల్లు -34 అ॥లు, ఉత్తరం: 26 లింకుల వెడల్పు రోడ్డు - 57.6 అ॥లు.

ఐటెమ్ నం.2 (4075/2006): ప్రకాశం జిల్లా, మార్టూరు ఎస్ఆర్ఓ, మార్టూరు మండలం, మార్టూరు గ్రామం, మార్టూరు గ్రామపంచాయతీ ఏరియా, అసెస్‌మెంట్ నం: 2392, ఆస్తి డోర్ నం.7-345, దగ్గరి డోర్ నం: 6-13, సర్వే నం.608/ఎ, సి, 4,ఎ 601/సి,3 లో 24 చదరపు గజాలు లేదా 20.16 చదరపుమీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన గ్రౌండ్, మొదటి మరియు రెండవ అంతస్తు ఆర్.సి.సి. భవనం మరియు భూమి మొత్తంగా. హద్దులు: తూర్పు: ఈ ఆస్తి మరియు తేలప్రోలు శ్రీనివాసరావు మరియు దొడ్డ వీర బ్రహ్మానందం ఆస్తికి చేరుకునేందుకు విడిచి పెట్టిన 10 అ॥ల వెడల్పు దారి - 3.9 అ॥లు. దక్షిణం: కొమ్మాలపాటి పద్మావతి స్థలం-57 అ॥లు, పడమర: తిరువాయిపాటి రాంబాబుకుచెందిన ఇల్లు -3.9 అ॥లు, ఉత్తరం: ఐటెమ్ నం.1 ఆస్తి-57 అ॥లు. మొత్తం ఐటెమ్ నం.1 మరియు 2 కొలత ఆర్.సి.సి. భవనంతో 240 చదరపు గజాల స్థలం.

చెల్లింపు విధానం: అన్ని చెల్లింపులు హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట విజయవాడలో చెల్లుబాటయ్యేలా డిమాండ్ డ్రాఫ్ట్ లేదా ఆర్‌టిజిఎస్/నెఫ్ట్ ద్వారా ద్వారా చేయాలి. ఎక్కౌంట్ వివరాలు ఈ కింది విధంగా: ఎ) ఎక్కౌంట్ పేరు: హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, బి) బ్యాంక్ పేరు: హెచ్‌డిఎఫ్‌సి, సి) ఎక్కౌంట్ నెం:-HHFLTDAPVWDVJDAA598 డి) ఐఎఫ్ఎస్‌సి కోడ్:-HDFC0004989

ఆన్‌లైన్ ఇ-వేలం విక్రయానికి సంబంధించిన నిబంధనలు షరతులు: 1. ఆస్తి "ఎక్కడ ఉన్నది ఉన్నట్లు & ఏదైతే ఉందో అది & రికోర్స్ బేసిస్ లేని ప్రాతిపదికపై" విక్రయించబడును. అటువంటి విక్రయం ఎలాంటి వారెంటీలు & నష్టపరిహారం లేకుండా ఉంటుంది. 2. ఆస్తి / ఆస్తుల వివరాలు (అనగా. ఈ-వేలం విక్రయ నోటీసులో పేర్కొన్న పరిధి & కొలతలు సెక్యూర్డ్‌క్రెడిటార్‌కు తెలిసిన ఉత్తమ సమాచారం మేరకు పేర్కొనబడ్డాయి మరియు ఏదైనా లోపం, తప్పుడు స్టేట్‌మెంట్ లేదా విస్మరించడానికి సెక్యూర్డ్ క్రెడిటార్ జవాబుదారీగా కాదు. వాస్తవంగా ఉన్న విస్తీర్ణం& కొలతలు భిన్నంగా ఉండవచ్చు. 3.సెక్యూర్డ్ క్రెడిటార్ ద్వారా జారీ చేయబడిన ఇ-వేలం విక్రయ నోటీసు.. సాధారణ ప్రజానీకానికి బిడ్‌లను సమర్పించమని కోరుతూ ఆహ్వానం. ఇది సెక్యూర్డ్ క్రెడిటార్ పక్షాన ఎటువంటి నిబద్ధత లేదా ప్రాతినిధ్యాన్ని ఏర్పరచదు మరియు పరిగణించబడదు. సెక్యూర్డ్‌క్రెడిటార్ వద్ద దస్తావేజుల నకళ్లను పరిశీలించాలని, బిడ్‌లను సమర్పించే ముందు ఆస్తిని ప్రభావితం చేసే ఆస్తి / ఆస్తులు మరియు క్లెయిమ్‌లు / ఆస్తిపై ప్రభావం చూపే బకాయిల ప్రస్తుత స్థితి గురించి స్వతంత్ర విచారణలు / తగిన శ్రద్ధ వహించాలని ఆసక్తిగల బిడ్డర్లకు సూచించడమైనది. 4. వేలం/బిడ్డింగ్ https://www.bankeauctions.com వెబ్‌సైట్ ద్వారా "ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ మోడ్" ద్వారా మాత్రమే ఉంటుంది లేదా వేలం ఏర్పాటు చేస్తున్న సర్వీస్ ప్రొవైడర్ M/sC1 IndiaPrivate Limited, వారు ఇ-వేలం ప్లాట్‌ఫాం ద్వారా మొత్తం వేలం ప్రక్రియను ఏర్పాటు చేసి, సమన్వయం చేస్తారు. 5. బిడ్డర్లు తమ ఎంపిక స్థలం నుండి బిడ్డింగ్ కోసం ఇ-వేలంలో పాల్గొనవచ్చు. ఇంటర్నెట్ కనెక్టివిటీని బిడ్డర్ స్వయంగా నిర్ధారించుకోవాలి. ఇంటర్నెట్ కనెక్టివిటీ, నెట్‌వర్క్ సమస్యలు, సొంత సిస్టమ్ స్తంభించడం, విద్యుత్ వైఫల్యం మొదలైన వాటికి సెక్యూర్డ్ క్రెడిటార్/సర్వీస్ ప్రొవైడర్ బాధ్యత వహించరు. 6. ఇ-వేలం వివరాలు, సహాయం, విధానం మరియు ఆన్‌లైన్ బిడ్డింగ్ కోసం ఉద్దేశిత బిడ్డర్లు సర్వీస్ ప్రొవైడర్ ఎం/ఎస్. సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ప్లాట్ నెం-68, 3వ అంతస్తు సెక్టార్ 44 గుర్గావ్ హర్యానా -122003 (సంప్రదించు నం. 7291981124, 25 26), సహాయ ఇ-మెయిల్ Support@bankeauctions.com, శ్రీ పి. ధరణి కృష్ణ మొబైల్: 9948182222. ఇ-మెయిల్: andhra@c1india.com ను సంప్రదించవచ్చును. 7. ఇ-వేలం విక్రయంలో పాల్గొనే బిడ్డర్లు ముందుగా https://www.bankeauctions.com లో తమ పేరును నమోదు చేసుకుని వినియోగదారు ఐడీ,పాస్‌వర్డ్‌ను పొందాలి. సర్వీస్ ప్రొవైడర్ నుంచి పాస్‌వర్డ్‌ను స్వీకరించిన వెంటనే దానిని మార్చుకోవాలని ఉద్దేశించిన బిడ్డర్లు సూచించడమైనది. 8. ఇ-వేలంలో పాల్గొనడానికి, ఉద్దేశించిన బిడ్డర్లు రిజర్వ్ ధర లో 10శాతం (పైన పేర్కొన్నది) ఉండే రీఫండ్ చేయదగిన ఎర్నెస్ట్ మనీడిపాజిట్ (ఇఎండి)ని డిపాజిట్ (పైన పేర్కొన్నది) చేయాలి. డిమాండ్‌డ్రాఫ్ట్/నెఫ్ట్/ఆర్టీజీఎస్ ద్వారా "హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్" పేరిట 19-డిసెంబరు-2024 వరకు లేదా అంతకు ముందుగా చెల్లించాలి. 9. ఉద్దేశించిన బిడ్డర్లు సీలు వేసిన కవర్‌లో ఇఎండి కోసం తీసిన డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటు సరిగా పూర్తి బిడ్ ఫారం (https://www.bankeauctions.com లో అందుబాటులో ఉన్న ఫార్మాట్)ను అధీకృత అధికారి హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ , ఆర్/ఓ డోర్ నం. 15-12-12, ఐ3, 2వ అంతస్తు, తిలక్ నగర్, రెవిన్యూ కాలనీ, కర్నూలు టౌన్ & జిల్లా, ఆంధ్రప్రదేశ్-518003 కు 17-డిసెంబరు-2024 సాయంత్రం 05:00 గంటల వరకు పంపవచ్చును. సీలు వేసిన కవర్‌పై "హరిజన గోపీనాథ్ యొక్క ఆస్తి కొరకు రుణ ఖాతా సంఖ్యలు AP/KUR/KURL/A000000487 (పైన పేర్కొన్నట్లుగా) నందు ఇ-వేలం వేలంలో పాల్గొనదానికి బిడ్" అని రాయవలెను.10. ఈ-వేలం విక్రయ నోటీసులో పేర్కొన్న తేదీ మరియు సమయంలో ఆన్‌లైన్ ఇంటర్-సే బిడ్డింగ్/వేలం ప్రొసీడింగ్స్‌లో పాల్గొనేందుకు సర్వీస్ ప్రొవైడర్ M/SC1 India Pvt Ltd కి ఆ బిడ్డర్‌లను మాత్రమే అనుమతించడానికి ఇఎండితో బిడ్‌ల సమర్పణ చివరి తేదీ ముగిసిన తర్వాత, అధీకృత అధికారి అతనికి అందిన బిడ్‌లను పరిశీలించి, అర్హత కలిగిన బిడ్డర్‌ల (పైన పేర్కొన్న రిజర్వు ధర కంటే ఎక్కువ ధరను కోట్ చేసి, సెక్యూర్డ్‌క్రెడిటార్‌కు పేర్కొన్న ఇఎండీని చెల్లించిన వారు) వివరాలను నిర్ధారిస్తారు. 11. అర్హత పొందిన బిడ్డర్‌ల మధ్య అర్హత పొందిన బిడ్డర్లు కోట్ చేసిన అత్యధిక బిడ్ నుండి బిడ్డింగ్ ప్రారంభమవుతుంది. బిడ్డింగ్ ప్రక్రియలో ప్రతిసారీ "10" నిమిషాల అపరిమిత పొడిగింపు ఉంటుంది. అనగా చివరి పొడిగింపు నుండి 10 నిమిషాలలోపు బిడ్ చేస్తే ప్రతిసారీ ఇ-వేలం ముగింపు సమయం 10 నిమిషాలు స్వయంచాలకంగా పొడిగించబడుతుంది. 12.ఒకసారి వేసిన బిడ్‌లు రద్దు చేయబడవు లేదా ఉపసంహరించబడవు. బిడ్డర్‌కు ఇచ్చిన వినియోగదారు ఐడి నుండి చేసిన అన్ని బిడ్‌లు అతను మాత్రమే చేసినవిగా పరిగణించబడతాయి. 13. ఇ-వేలం ప్రక్రియ ముగిసిన వెంటనే, అత్యధిక బిడ్డర్ ఇ-వేలం విక్రయ ప్రక్రియలో విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటించబడేందుకు తాను కోట్ చేసిన బిడ్ యొక్క తుది మొత్తాన్ని అధీకృత అధికారి అధీకృత అధికారి హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ , ఆర్/ఓ డోర్ నం. 15-12-12, ఐ3, 2వ అంతస్తు, తిలక్ నగర్, రెవిన్యూ కాలనీ, కర్నూలు టౌన్ & జిల్లా, ఆంధ్రప్రదేశ్-518003 కు మరియు సర్వీస్ ప్రొవైడర్‌కు ఇ-మెయిల్ ద్వారా ధృవీకరించాలి. 14.విజయవంతమైన బిడ్డర్ అమ్మకం జరిగిన అదే రోజున బిడ్ మొత్తంలో 25% (ఇఎండితో సహా) డిపాజిట్ చేయాలి మరియు బిడ్ మొత్తంలో మిగిలిన 75% విక్రయించిన తేదీ నుండి 15 రోజులలోపు హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ పేరిట డిడి/పే ఆర్డర్/నెఫ్ట్/ఆర్టీజీఎస్/చెక్ ద్వారా చెల్లించాలి. 15. విజయవంతమైన బిడ్డర్/వేలం కొనుగోలుదారు నిర్ణీత సమయంలోగా పైన పేర్కొన్న మొత్తాలను చెల్లించడంలో విఫలం అయినట్లయితే, అమ్మకం రద్దు చేయబడుతుంది మరియు ఇప్పటికే చెల్లించిన మొత్తం (ఇఎండీతో సహా) జప్తు చేయబడుతుంది మరియు ఆస్తి మళ్లీ అమ్మకానికి ఉంచబడుతుంది.16. విజయవంతమైన బిడ్డర్ యొక్క అభ్యర్థన మేరకు, అధీకృత అధికారి తన సంపూర్ణ అభీష్టానుసారం, బిడ్ మొత్తంలోని మిగిలిన మొత్తాన్ని డిపాజిట్ చేయడానికి రాతపూర్వకంగా మరింత సమయాన్ని మంజూరు చేయవచ్చు. 17.విజయవంతమైన బిడ్డర్ అమ్మకపు ధరలో 1% టిడిఎస్ చెల్లించాలి (విక్రయానికి వచ్చిన ఆదాయంలో) మరియు అధీకృత అధికారికి టిడిఎస్ సర్టిఫికేట్‌ను సమర్పించాలి మరియు అధీకృత అధికారి ఆఫర్‌ను అంగీకరించిన 15 పని రోజులలోపు లేదా అధీకృత అధికారి సరిపోతుందని భావించి పొడిగించిన ఇతర సమయంలో ఇఎండి సర్దుబాటు చేయడం ద్వారా అమ్మకపు ధర మొత్తాన్ని (1%టిడీఎస్ తగ్గింపు తర్వాత) చెల్లించాలి. విఫలమైతే ధరావత్తు సొమ్ము డిపాజిట్ జప్తు చేయబడుతుంది. 18. మున్సిపల్/పంచాయతీ పన్నులు, విద్యుత్ బకాయిలు (ఏదైనా ఉంటే) మరియు ఏదైనా ఇతర అధికారుల బకాయిలు (ఏదైనా ఉంటే) విక్రయ ధృవీకరణపత్రం జారీ చేయడానికి ముందు విజయవంతమైన బిడ్డర్ చెల్లించాలి. ఆస్తికి సంబంధించిన అన్ని చట్టబద్ధ బకాయిలను పరిగణనలోకి తీసుకుని బిడ్లు వేయబడతాయి. 19. మొత్తం కొనుగోలు ధర/బిడ్ మొత్తాన్ని డిపాజిట్ చేసి, ఆపై అన్నిపన్నులు/ఛార్జీల చెల్లింపుకు సంబంధించి అవసరమైన రుజువును అందించిన తర్వాత మాత్రమే విజయవంతమైన బిడ్డర్‌కు అనుకూలంగా ఆథరైజ్డ్ ఆఫీసర్ ద్వారా సేల్ సర్టిఫికెట్ జారీ చేయబడుతుంది. 20. రవాణా, స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు మరియు ఇతర యాదృచ్ఛిక ఛార్జీల కోసం వర్తించే చట్టపరమైన ఛార్జీలను వేలం కొనుగోలుదారు భరించాలి. 21. అధీకృత అధికారి ఏ కారణం చెప్పకుండానే ఈ-వేలం విక్రయ ప్రక్రియలను వాయిదా వేయవచ్చు / రద్దు చేయవచ్చు. ఒకవేళ ఇ-వేలం విక్రయాల షెడ్యూల్‌ను షెడ్యూల్ చేసిన విక్రయ తేదీ నుండి 30 రోజులలోపు తదుపరి తేదీకి వాయిదా వేసినట్లయితే, అది సర్వీస్ ప్రొవైడర్ వెబ్‌సైట్‌లో ప్రదర్శించబడుతుంది. 22. అధీకృత అధికారి నిర్ణయం అంతిమమైనది, ప్రశ్నించడానికి వీలులేనిది. 23. బిడ్‌లను సమర్పించిన బిడ్డర్లందరూ ఇ-వేలం విక్రయం యొక్క నిబంధనలు మరియు షరతులను చదివి, అర్థం చేసుకున్నట్లు భావించబడతారు మరియు వాటికి కట్టుబడి ఉండాలి. 24. మరిన్ని వివరాలు మరియు సందేహాల కోసం, అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీ వి. మస్తాన్‌వలి, మొబైల్ నం: 9885649400 ని సంప్రదించవచ్చును. 25. సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, యొక్క నిబంధన 8(6)కు అనుగుణంగా పైన పేర్కొన్న తేదీ, సమయంలో వేలం విక్రయాన్ని నిర్వహించడం గురించి, రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారులకు ఈ ప్రచురణ 30 (ముప్పై) రోజులుగా నోటీసుగా భావించవలెను.

ప్రదేశము: ప్రకాశం తేదీ: 17-11-2024

అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్రత్యేక సూచనలు / జాగ్రత్తలు: చివరి నిమిషాలు/సెకన్లలో బిడ్డింగ్‌లో పాల్గొనుటను బిడ్డర్లు వారి స్వంత ఆసక్తితో నివారించుకోవాలి. అటువంటి సందర్భాలలో బిడ్డర్ నుండి ఏదైనా లోపాలు/వైఫల్యానికి (ఇంటర్నెట్ వైఫల్యం, విద్యుత్ వైఫల్యం మొదలైనవి) హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ లేదా సర్వీస్ ప్రొవైడర్ బాధ్యత వహించరు. అటువంటి ఆకస్మిక పరిస్థితిని నివారించడానికి, బిడ్డర్‌లు అవసరమైన అన్ని ఏర్పాట్లు / బ్యాకప్ విద్యుత్ సరఫరా వంటి ప్రత్యామ్నాయాలు మరియు అవసరమైన వాటిని ఏర్పాటు చేసుకోవాలని అభ్యర్థించడమైనది. తద్వారా వారు అటువంటి పరిస్థితిని తప్పించుకోగలుగుతారు మరియు వేలంలో విజయవంతంగా పాల్గొనగలరు.

చంద్రబాబు నాయుడు కాలనీకి దారి ఏదీ...?

విశాలాంధ్ర-తర్లుపాడు : గృహ నిర్మాణాల నిమిత్తం 2010వ సంవత్సరంలో గ్రామానికి సమీపాన పడమటి వైపున స్థలం కేటాయించ డం జరిగింది. అందులో 2016లో ఆనాటి ప్రభుత్వం సుమారు 40 మంది పేదలకు లేఅవుట్లను ఏర్పాటు చేసి గృహ నిర్మాణ వసతి కల్పించడం జరిగింది. ఆ కాలనీకి చంద్రబాబు నాయుడు కాలనీ అని నామకరణం చేయడం జరిగింది. కానీ కాలనీలో రస్తా విషయంపై గందరగోళ పరిస్థితి నెలకొన డం కూడా నాటి నుండి నేటి వరకు కొన సాగుచున్నది. దానిపై అనేక చట్టప రమైన చిక్కులు ఎదురు కావడం జరిగింది. అనంతరం 2018లో కోర్టు స్టే తెచ్చుకోవడం జరిగింది. ఇలా కొంతకాలం గడుస్తున్న తరు ణంలో 2020లో స్టే తొలగి పోయిందని అప్రోచ్ రోడ్డులో తప్పుడు రిజిస్ట్రర్లు చేయడం జరిగింది. దీనిపై కాలనీవాసులు తమకు దారి చూపించమని, మాకు తగిన న్యా యం చేయమని సంబంధిత మండల రెవెన్యూ తహసీల్దార్ భాస్కరరావును కోరడం జరిగింది. దీంతో తహసీ ల్దార్ సమగ్రమైన విచారణ జరప కుండా ఇంటి నెంబర్లను పరిశీలించ కుండా ఎలాంటి ఆధార రహితమైన తప్పుదురిపోర్టులనుఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని వారు ఆవేదన చెందారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని కాలనీ ప్రజలకు దారి చూపేందుకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు ధర్నా నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి పి గోపీనాథ్ చౌదరి, మండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి. బి రమణయ్య, బి సుబ్బ రామయ్య, నాగేంద్ర లక్ష్మయ్య, ఎం పుల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఫ్రెషర్స్ డే

విశాలాంధ్ర-ఒంగోలు : కోటి ఆశలతో అడుగు పెట్టిన ప్రథమ సంవత్సరం మెడికోలు ..తమ పిల్లలను వైట్ కోట్‌లో చూసుకొని మురిసిపోరున్న తల్లిదండ్రులు ఒక వైపు..భావి డాక్టర్లని తయారు చేసే బృహత్తర బాధ్యత ఎత్తుకున్న ప్రొఫెసర్ లు ఒక వైపు...జూనియర్స్‌కి అద్భుతంగా ఆహ్వానం పలికే పనుల్లో బిజీ గా సీనియర్స్ ఇది వెరసి ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల లో శనివారం జరిగిన ఫ్రెషర్స్ డే వేడుకల సమాహారం. తల్లిదండ్రుల ఆశలు విద్యార్థుల భవిష్యత్తుతో కూడిన బాధ్యత కళాశాల పై వుందారని వారిని మంచి డాక్టర్లుగా తీర్చి దిద్దు తామని అదే సమయంలో బాధ్యతగా ఉండాల్సిన బాధ్యత విద్యార్థులదే అని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ ఏడుకొండలరావు ఉపదేశం చేశారు ఫ్రెషర్స్ వేడుకల సందర్భంగా ఆయన తల్లిదండ్రులు మెడికోలను ఉద్దేశించి ప్రసంగించారు. ఎటువంటి ప్రభావాల కు లోను కావద్దని, ఏ సమస్య ఉన్నా నేరుగా ప్రిన్సిపాల్, ఫాకల్టీ, వార్డన్స్ మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. మంచి వాతావరణం, నిష్ణాతులైన ఫ్యాకల్టీ అందుబాట్లో ఉన్నారని, మంచి వైద్యులుగా రాణించాలని జిజిహెచ్ సూపరెంటెండెంట్ డాక్టర్ జమున అన్నారు. ఎంబీబీఎస్ సీట్ రావడం దేవుడు ఇచ్చిన అదృష్టంగా భావించాలని, డబ్బు వెనుక పరుగెత్తాలి అనే ఆలోచన మానుకుని మంచి సేవ చేస్తే డబ్బే మన వెనక వస్తుంది అని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ దుర్గా దేవి, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సుధాకర్ బాబు, డా శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ బి తిరుమల రావు, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా 120 మంది మొదటి సంవత్సరం విద్యార్థులకు వైట్ కోట్ బహూక రించారు. ప్రతి ఒక్కరితో అతిథులు ఫోటో లు దిగి వారిని ప్రోత్సాహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కేరింతల మధ్య ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ఇద్దరికీ తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-పామూరు : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన శనివారం 565 జాతీయ రహదారి నాసాగు వద్ద జరిగింది. వివరాలు ఇలా ఉన్నా యి. ప్రకాశం జిల్లా పొదిలి ఎస్టి కాలనీకి చెందిన నగులూరి రాజు (30) తమ ద్విచక్ర వాహనంపై భార్య, ఆరు, నాలుగు సంవత్స రాలు గలిగిన కుమారులతో కలిసి పామూరు ఎస్టి కాలనీలో శుభకార్యానికి వస్తున్నట్లు సమాచారం. నాసాగు దగ్గరికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీ కొట్టింది. దీంతో రాజుకి మెదడు బయటికి వచ్చింది. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యం పొందుతూ రాజు మృతి చెందారు. ఆయన భార్య వెంకటరమణకు, ఆరు సంవత్సరాల బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. నాలుగు సంవత్సరాలు కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలల హక్కులపై అవగాహన

విశాలాంధ్ర-తాళ్లూరు : బాల్య వివాహాలు బంగారు భవిష్యత్తు ఆటంకం అని జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. శ్యాం సునీల్ అన్నారు. బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన లక్కవరంలో సమావేశం నిర్వహించారు. వేల్ఫేర్ అసిస్టెంట్ సాధన, మహిళా పోలీస్ కోటేశ్వరి తదితరులు బాలల హక్కుల పై అవగాహన కల్పించారు.

ప్రశ్నించే గళానికి వెన్నెముక 'పత్రికలు'

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపరెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : మానవుని మనుగడకు అక్షరము ఆయుధం అయితే, దేశ మనుగడకు వార్తాపత్రికలు వజ్రాయుధం లాంటివని జన విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూప రెడ్డి అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని పి స్వరూప రెడ్డి మాట్లాడుతూ వార్తాపత్రికలు రెండు వైపులా పదునైన అస్త్రం. సామాన్యుడి చేతిలో ఆయుధం. జర్నలిజాన్ని ఉద్యోగములా కాకుండా వృత్తిగా భావించి, విలువలతో కూడిన వృత్తి నైపుణ్యాలను పెంచుకొని సమాజాభివృద్ధిలో భాగస్వామి కావాలని, లోపాలను ఎత్తి చూపడమే జర్నలిస్టుల హక్కు బాధ్యత అన్నారు. ఒక దేశములో ప్రజాస్వామ్యము సక్రమంగా పనిచేస్తుందా, లేదా తెలుసుకోవాలంటే ఆ దేశంలో పత్రికారంగాన్ని పరిశీలిస్తే చాలు. పత్రికా రంగం మీద ఎటువంటి ఆంక్షలు లేకుండా పత్రికా ప్రజాస్వామ్యము అమలు అవుతుంటే ఆ దేశంలో ప్రజాస్వామ్య పాలనకు, చట్టబద్ధమైన పాలనకు డోకా లేనట్లే అన్నారు.

నేడు తూర్పుగంగవరంలో విద్యుత్‌కు ఆటంకం

విశాలాంధ్ర-తాళ్లూరు : తూర్పుగంగవరం సబ్ స్టేషన్ పరిధిలో నూతన లైన్స్ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని ఇన్‌ఛార్జి ఎఈ వి. శ్రీనివాసరావు తెలిపారు. వినియో గదారులు గమనించి తగిన జాగ్రత్తలు పాటించి సహకరించా లని కోరారు.

వ్యవసాయ కళాశాలలో సాంస్కృతిక సమ్మేళనం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగే రెండో విడత అంతర కళాశాలల క్రీడలు, సాహిత్యం, సాంస్కృతిక సమ్మేళనంలో సిఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్న గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పీ చైతన్య, సుస్మిత, చైత్ర, ఫిజికల్ మాస్టర్స్ బి మౌనిక, బండారు రవీంద్రా బాబు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంతో....వ్యాధులు దూరం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండల కేంద్రమైన పుల్లల చెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డేటాల్ బానేగా స్వస్థ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా గ్రామాలయ మరియు సార్డ్ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ టీ లక్ష్మి ఆధ్వర్యంలో విద్యా ర్థులకు డేటాల్ హ్యాండ్ వాష్ మరియు వ్యక్తిగత పరిశుభ్రత అంశాలను విద్యార్థులకు అవగాహన కల్పించి ఒకరి నుండి మరొకరికి బ్యాక్టీరియా వైరస్ ఏ విధంగా వ్యాపించి అనారోగ్యం కలిగి స్తుంది అనేది డెమో ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపా ధ్యాయులు, వై శ్రీవాసరెడ్డి ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ ఆదేశాలను అమలు చేయాలి

విశాలాంధ్ర-టంగుటూరు: గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉప ముఖ్యమంత్రి మరియు పంచాయతీరాజ్ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలను అమలు చేయాలని టంగు టూరు మండల జనసేన అధ్యక్షులు కందుకూరి రాంబాబు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజను కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో జరుగుతున్న పలు అభివృద్ధి పను లను పరిశీలించడానికి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ విఆర్ కృష్ణ తేజ శు క్రవారం కొండెపి నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా టంగు టూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు కందుకూరి రాంబాబు గ్రామ పంచాయతీలలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించిన విధంగా పంచాయతీ కార్యాలయాలలో మంజూ రైన పనుల వివరాలు జరుగుతున్న అభివృద్ధి పనులు సిటిజన్ చార్ట్ బోర్డు ఏర్పాటు చేయాలని కమిషనర్ ను కోరారు. రాష్ట్రస్థాయిలో మార్పులు చేసి గిరిజన కాలనీలలోని సమస్యలను పరిష్కరిస్తామని పంచాయితీ రాజ్ శాఖ కమిషనర్ విఆర్ కృష్ణ తేజ జనసేన నేతలకు హామీ ఇచ్చారు.

హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

HINDUJA HOUSING FINANCE

CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com

కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా.
రీజినల్ ఆఫీసు: హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 54-20-10/1ఏ, ఫ్లాట్ నెం.43, 3వ అంతస్తు, ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా, మెయిన్‌రోడ్, గురునానక్ కాలనీ, విజయవాడ-520008

అనుబంధం-4 **స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారుడు హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోపు నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించమని కోరుతూరుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు కంపెనీ యొక్క అధీకృత అధికారి డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీత మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత(ల)/ హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదవగల సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద వారికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకోవడమైనది. సెక్యూర్డు అసెట్స్ విమోచానికి అందుబాటులోవున్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8) క్రింద రుణగ్రహీత శ్రద్ధను ఆహ్వానిస్తున్నారు. ప్రధానంగా రుణగ్రహీతలు/హామీదారులు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలను జరపదలచిన వారు హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ వారికి దిగువ పేర్కొన్న డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై తదుపరి వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత(ల)/ హామీదారు(ల) పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనతా తేది
1	1) శ్రీ బత్తుల శ్రీను, తండ్రి బి.పోలయ్యా, ...రుణగ్రహీత, 2) శ్రీమతి బత్తుల కొండమ్మ, భర్త బత్తుల శ్రీను, ...సహ-రుణగ్రహీత, ఇరువురి నివాసం: ఇ.నెం.1-134, గుర్రప్పడియా (గ్రా), ముగచింతల, కొండిపి (మం), ప్రకాశం జిల్లా, పిన్ కోడ్ 523270 PIN CODE 523270. LAN NO. AP-ONG-ONGL-A000000013	08-07-2024, రూ.7,67,551/- (రూపాయలు ఏడు లక్షల అరవై ఏడు వేల ఐదు వందల యాభై ఒక్కటి మాత్రమే)	12-11-2024
	సెక్యూర్డు అసెట్ (స్థిరాస్తి వివరణ): ప్రకాశంజిల్లా, సింగరాయకొండ ఎస్.డి, కొండపి అర్‌వెన్యూ మండలం, గుర్రప్పాడియా గ్రామం మరియు గ్రామపంచాయతీ, సర్వే నెం.83, డోర్ నెం:1-134, ఇల్లు మరియు సైట్. సరిహద్దులుగా: తూర్పు: బజార్, పడమర: బజార్, ఉత్తరం: అరితోటి శేషమ్మ ఇల్లు, దక్షిణం: బజార్. సరిహద్దుల్లో 242 చ.గ.లు లేదా 203.28 చ.మీ.ల విస్తీర్ణపు స్థలం, ఇక్కడ 672 చ.అ.ల ఆర్‌సిసి బిల్డింగ్ అన్ని సౌలభ్య హక్కులతో.		
2	1) శ్రీ సోంగకొండయ్య తండ్రి మాల కొండయ్య, ...రుణగ్రహీత 2) శ్రీమతి సోంగ రుతు, భర్త సోంగ కొండయ్య, ...సహ-రుణగ్రహీత, ఇరువురి నివాసం: ఇ.నెం.1-223, గుర్రపాడియా, కొండెపి (మం), ముగచినాల, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్- 523270. LAN No: AP/ONG/ONGL/A000000004.	27-07-2024, రూ.8,36,034/- (రూపాయలు ఎనిమిది లక్షల ముప్పై ఆరు వేల ముప్పై నాలుగు మాత్రమే)	12-11-2024
	సెక్యూర్డు అసెట్ (స్థిరాస్తి వివరణ): సర్వే నెం.83, సమీప డోర్ నెం.1-143, ఆస్తి అసిస్ట్ నెం. 338, గుర్రపాడియా గ్రామపంచాయతీ మరియు గుర్రపాడియా గ్రామం, కొండెపి మండలం, ఎస్‌ఆర్‌ఓ సింగరాయకొండ, ఒంగోలు రిజిస్ట్రేషన్ ప్రకాశం జిల్లాలోని 124 చ.గ.లు లేదా 104 చ.మీ.ల విస్తీర్ణంలో నిర్మిస్తున్న గ్రౌండ్ ఫ్లోర్ కలిగియున్న అసంపూర్తి ఆర్‌సిసి బిల్డింగ్ మరియు స్థలం మొత్తం, అన్ని సౌలభ్యం హక్కులతో పాటు: సరిహద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: సొంగ కొండయ్యకు చెందిన ఇల్లు, పడమర: దారి, ఉత్తరం: సొంగ మాలకొండ రావుకు చెందిన ఇల్లు.		

ప్రదేశం: ప్రకాశం, తేది: 17-11-2024 సం/- (అధీకృత అధికారి), హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

జర్నలిస్టులు సమాజానికి దిక్సూచిలా ఉండాలి

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర – బాపట్ల : జర్నలిస్టులు సమాజానికి దిక్సూచిలా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లాలోని జర్నలిస్టులందరికీ జిల్లా కలెక్టర్ శనివారం శుభాకాంక్షలు తెలిపారు.పాత్రికేయులు స్థానిక కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.జర్నలిస్టుల పిల్లలందరికీ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో కలెక్టర్‌ని సన్మానించారు.ప్రభుత్వానికి ప్రజలకు వారధిలా జర్నలిస్టులు పనిచేస్తున్నారని కలెక్టర్ అన్నారు. మంచి సమాజ నిర్మాణంలో పాత్రికేయులు భాగస్వాములయ్యారన్నారు. అనంతరం జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు.

ఐటీడీపీ సోషల్ మీడియాపై చర్యలు తీసుకోండి

- సీఐకి వైసీపీనేతలు వినతిపత్రం అందజేత

విశాలాంధ్ర – బాపట్ల : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ అనుబంధ సోషల్ మీడియా విభాగం ఐటిడిపి,కూటమి సోషల్ మీడియా చేస్తున్న అత్యంత నీతి బాహ్యమైన, నీచమైన పోస్టులను ప్రచారంలోకి పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ సిఐ మహ్మద్ జానీకి వైసీపీ నేతలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు మాట్లాడుతూ వైఎస్ఆర్‌సిపి సోషల్ మీడియా సంబంధించిన యువతీ యువకులపై ఒక పథకం ప్రకారం ఐటీడీపీ మరింత వేగం పోస్టుల తో వ్యక్తిత్వ హననం చేస్తున్నారన్నారు. . ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్య క్షులు జోగి రాజా, బాపట్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణ మూర్తి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొక్కిలగడ్డ చెంచయ్య, సర్పంచ్ బొలిమేర అనిల్,మాజీ సర్పంచ్ ఇస్సాక్, మాజీ సర్పంచ్ బడుగు ప్రకాష్, గునివిని మణి రెడ్డి, నక్క సోమి రెడ్డి,కటికల యెహోషువ, పాలపర్తి గోపీక్రిష్ణ ఉన్నారు.

కారంచేడులో 'పోలీసుల పల్లెనిద్ర'

విశాలాంధ్ర – కారంచేడు : కారంచేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ని కారంచేడు గ్రామంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్ పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖకు ప్రజలకు మంచి సమన్వయం కుదిరేందుకు ఈ పల్లెనిద్ర కార్యక్రమం దోహదపడుతుందన్నారు. స్థానిక వివాదాలు శాంతి,భద్రతల సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం తెలియచేయాలన్నారు. ఇంకొల్లు సిఐ. రమణయ్య, కారంచేడు యస్ ఐ వెంకటరావులు పోలీస్ సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

రామకృష్ణకు అభినందనలు వెల్లువ

విశాలాంధ్ర – నిజాంపట్నం : రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన నిజాంపట్నం టీడీపీ సీనియర్ నాయకులు బొమ్మిడి రామకృష్ణకు అభి నందనలు వెల్లువెత్తుతున్నాయి.ఈ మేరకు శనివారం నిజాంపట్నంలోని ఆయన నివాసంలో మండలంలోని ఆముదాలపల్లి పంచాయతీ చింతరేవు గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు,టీడీపీ కార్యకర్తలు అలాగే నిజాంపట్నం పంచాయతీ థామస్ పేటకు చెందిన పలువురు గ్రామస్తులు,టీడీపీ కార్యకర్తలు విరి విరిగా కలిసి దుశ్శాలువాలు,పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వీట్లు తినిపిస్తూ ప్రత్యేక అభినందన శుభాకాంక్షలు తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు ఉచితంగా శిక్షణ

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర – బాపట్ల : డీఎస్సీ ఉద్యోగాలకు ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇవ్వడం శుభపరిణామమని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించనున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు స్థానిక సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు.ప్రారంభ సూచికగా జ్యోతి వెలిగించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే 17వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారన్నారు.జిల్లాకు 700 పోస్టు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం ప్రభుత్వమే 220 మంది ఎస్సీ, ఎస్టీ,బీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రావీణ్యం పొందిన వారితో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. కష్టపడి చదవండి, క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఆయన సూచించారు. పోరాడితే పోయేదేమీ లేదు దాస్య శృంకలాలు తప్ప అంటూ కారల్ మార్క్స్ సూక్తులను ఆయన గుర్తు చేశారు.మీలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని ఎదగాలన్నారు.మీ భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఉచిత శిక్షణాలు ఇవ్వడం సంతోషదాయకమ న్నారు. డీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ప్రభుత్వమే ఉచితంగా నాణ్యమైన శిక్షణ ఇస్తుందని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి జె.రాజా దెబోరా అన్నారు. ప్రస్తుత 43 మంది అభ్యర్థులకు శిక్షణ ప్రారంభించామన్నారు.ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎవరైనా శిక్షణ పొందటానికి రావచ్చన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ,అవకాశాలను అందిపుచ్చుకుని ఉద్యోగాలు పొందాలని బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఎస్. రాజశేఖర్ బాబు చెప్పారు.యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఉచిత శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషదాయ కమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సాధికారత ఇంచార్జ్ అధికారి రాజేష్ దాసు,తహసీల్దార్,సలీమా,ఏసి సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు నివేశన స్థలం మంజూరు చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్

విశాలాంధ్ర – చీరాల : అర్హులైన పేదలందరికీ పట్టణంలో రెండు సెంట్లు పల్లెలో మూడుసెంట్లు నివేశన స్థలం కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల శామ్యూల్ అన్నారు.సీపీఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం చీరాల నియోజక వర్గంలోని అర్హులైన పేదలచే ఇంటి నివేశన స్థలాల కోసం వినతి పత్రం సమర్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శామ్యూల్,మేడ వెంకట్రావులు మాట్లాడుతూ ప్రతి పక్ష నేతగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు రాష్ట్రంలోని అర్హులైన పేదలకు ఇంటి నివేశన స్థలం మంజూరు చేస్తానని పేదలకు ఇచ్చిన హామీ నేడు పాలక పక్షంలో ఉండి నెరవేర్చాలన్నారు.నివేశన స్థలం లేని అర్హులైన పేదలకు స్థలం కేటాయించి ఇళ్ళు నిర్మాణం చేసి పేదలను ఆదుకోవాలన్నారు. స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేపట్టలేని పేదలకు ప్రతిపక్షంలోని చంద్రబాబు నాలుగు లక్షల పరిహారం ఇస్తానని హామీ ఇచ్చారని,ప్రస్తుతం సిమెంట్,ఇసుక,ఇనుము ధరలు పెరిగాయి. కనుక ప్రస్తుత ధరల ప్రకారం ఐదు లక్షలకు పరిహారం పెంచి ప్రతి పేదవాడు సొంత ఇంటిలో జీవనం కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.సోమవారం జరిగే కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ జిల్లా నాయకులు పాల్గొంటా న్నారు.సోమవారం చీరాల నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పేదలచే ఇంటి నివేశన స్థలాల కోసం వినతి పత్రాలు సమర్పిస్తామని, ఇంటి స్థలం లేని పేదలందరు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరు మల ప్రకాష్, చీరాల పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు అచ్చుతుని బాబూరావు,చీరాల ఆటో డ్రైవర్లు భానుప్రకాష్, పచ్చిపులుసు నరేంద్ర,రవి కిరణ్ పాల్గొన్నారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయంలో కోటి ఒత్తులతో దీపోత్సవం

విశాలాంధ్ర – రేపల్లె : రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో వేం చేసియున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి భక్తులు వివిధ రకాలైన ఫలాల తోటి శివలింగం ఆకారం ఏర్పాటు చేసి కోటి ఒత్తులు వెలిగించారు. ఈ సందర్భంగా స్వామివారికి 11 రకాల దివ్య ప్రసాదములు తయారు చేయించి భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. చావలి రమేష్, కార్య నిర్వాహణాధికారి దేవి వెంకట అప్పలాచార్యులు, దేవస్థానం గుమస్తా వెంకటేశ్వరావు, పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర – రేపల్లె : లివింగ్ హోప్ మినిస్ట్రీస్ పాస్టర్ గూడూరు మధుబాబు సతీమణి సుమని రేపల్లె అరుణ శ్రీ వికలాంగుల సంక్షేమ సేవా సంఘం సభ్యులు 40 మంది దివ్యాంగులకు దుప్పట్లు, స్వీట్స్, పంపిణీ చేసినట్లు సంక్షేమ సంఘం అధ్యక్షులు జానం మురళి కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ వికలాంగుల సంక్షేమ సంఘం కోశాధికారి షేక్ ఖాదర్ వలీ, సభ్యులు దోవ గోపీనాథ్, ఓబుల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆర్డీవో సమీక్ష

విశాలాంధ్ర – రేపల్లె : త్వరలో జరగనున్న సాగునీటి సంఘాల పాలకమండలి ఎన్నికలకు సంబంధించి మండల స్థాయి అధికారులతో రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి ఎన్.రామలక్ష్మి శనివారం సమీక్ష శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు. అధికారులకు తగు సూచనలు చేశారు. జిల్లా శిక్షణ అధికారి, మండల తాసిల్దార్ ఎం శ్రీనివాసరావు, డిఈఈ వెంకట ప్రసాద్, ఇరిగేషన్ శాఖ ఏఈలు, ఈవోలు, పాల్గొన్నారు.

వసూళ్లు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర – బాపట్ల టౌన్ : పన్నుల వసూళు వేగవంతం చేయాలని గుంటూరు రీజియన్ ప్రాంతీయ సంచాలకులు యస్.హరికృష్ణ తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయ కమిషనర్ ఛాంబర్‌లో కమిషనర్ జి.రఘునాథ రెడ్డి రెవెన్యూ విభాగ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నులు,ఖాళీ స్థలం పన్నులు,నీటి చార్జీల వసూళ్ల విషయమై సిబ్బందిని సచివాలయాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మునిసిపల్ డంపింగ్ యార్డును ఆయన పరిశీలించి బయోమైనింగ్ జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. మునిసిపల్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ డి.ప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బార్,రెవెన్యూ ఇన్స్పెక్టర్లు జి.శివ రామకృష్ణ,శ్రీ షేక్.ఇమామ్,శానిటరీ ఇన్స్పెక్టర్లు కరుణ,డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.